# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



**విలేకరులు కావలెను**

హైదరాబాద్ పల్స్

“ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం” అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 118 | పేజీలు : 08 | సోమవారం | 04-05-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## సీఎం, మంత్రులు రోడ్లపై తిరగలేరు..

### రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ

- ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని కేటీఆర్ ఆరోపణ
- సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఘాటైన బహిరంగ లేఖ
- జీవో 7ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్
- 10 వేల కోట్ల బకాయిలు చెల్లించకుండా పథకానికి ఎసరు పెడుతున్నారని విమర్శ
- విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరిక



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై రాజకీయ దుమారం చెలరేగింది. ఈ పథకాన్ని రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,

2

## కరీంనగర్ లో దొంగల బీభత్సం...

### కొన్ని నిమిషాల ముందు తాను అదే ప్రాంతంలో ఉన్నానన్న బండి సంజయ్

- కరీంనగర్‌లోని పీఎంజే జ్యువెలర్స్‌లో కాల్పుల ఘటన
- దోపిడీ యత్నాన్ని అడ్డుకోవడంతో సిబ్బందిపై దుండగుల దాడి
- ఈ ఘటనలో సేల్స్ మేనేజర్ సహా పలువురు ఉద్యోగులకు గాయాలు
- ఘటనపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి
- నిందితుల కోసం పోలీసుల గాలింపు, సీసీటీవీ ఫుటేజ్ పరిశీలన

2



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

కరీంనగర్‌లోని పీఎంజే జువెలర్స్‌లో జరిగిన కాల్పుల ఘటనపై కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటన జరిగిన కొన్ని నిమిషాల ముందే తాను అదే ప్రాంతంలో ఉన్నానని, తన కార్యాలయానికి సమీపంలోనే ఈ ఘటన

## నేడే కౌంటింగ్...

### బెంగాల్, తమిళనాడు పైనే అందరి దృష్టి

- బెంగాల్, తమిళనాడు సహా ఐదు అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారం
- ఎగ్జిట్ పోల్స్‌లో బెంగాల్‌లో బీజేపీ, కేరళలో యూడీఎఫ్‌కు మొగ్గు, హోరాహోరీ అంచనాలు
- తమిళనాడులో నటుడు విజయ్ పార్టీ టీవీకే రాకతో మారిన రాజకీయ సమీకరణాలు
- కౌంటింగ్ కేంద్రాల వద్ద కనీవినీ ఎరుగని రీతిలో మూడంచెల భద్రతా వ్యవస్థ
- బెంగాల్‌లోని ఫాల్టాలో రీపోలింగ్ కారణంగా 293 స్థానాలకే ఓట్ల లెక్కింపు

2




హైదరాబాద్ పల్స్,డెస్క్

దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపిన 4 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు సమయం ఆసన్నమైంది. పశ్చిమ బెంగాల్, అసోం, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నేడే(మే 4) ఉదయం 8 గంటలకు ప్రారంభం కానుంది. మొత్తం 823 అసెంబ్లీ స్థానాల భవితవ్యాన్ని తేల్చే ఈ లెక్కింపు కోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. ఏప్రిల్ నెలలో పలు దశల్లో ఈ రాష్ట్రాల్లో పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే.

**హోరాహోరీ పోరు.. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు**

ఈ ఐదు రాష్ట్రాల్లో అందరి దృష్టి పశ్చిమ బెంగాల్, తమిళనాడుపైనే కేంద్రీకృతమై ఉంది. పశ్చిమ బెంగాల్‌లో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు నడిచింది. టీఎంసీ 200కు పైగా సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తుండగా, చాలా ఎగ్జిట్ పోల్స్ బీజేపీ విజయం సాధించే అవకాశం ఉందని అంచనా వేశాయి. మరోవైపు, తమిళనాడులో అధికార డీఎంకే కూటమి మరోసారి అధికారం నిలబెట్టుకోవాలని చూస్తుండగా, నటుడు విజయ్ నేతృత్వంలోని ‘తమిళగ వెట్రి కళగం’ (టీవీకే) రంగ ప్రవేశంతో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. కొన్ని పోల్స్ టీవీకే ఆధిక్యం కనబరుస్తుందని అంచనా వేయడం గమనార్హం. ఇక కేరళలో పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్‌ను కాదని, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్‌కు అధికారం దక్కవచ్చని పోల్స్ చెబుతున్నాయి. అసోంలో హిమంత బిశ్వ శర్మ సారథ్యంలోని బీజేపీ

## 700 మందికి పైగా

### హైదరాబాదులో డ్రంక్ అండ్ డ్రైవ్..

- హైదరాబాద్, సైబరాబాద్ పరిధిలో వారాంతపు స్పెషల్ డ్రైవ్
- మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 700 మందికి పైగా పట్టివేత
- హైదరాబాద్‌లో 445, సైబరాబాద్‌లో 283 మందిపై కేసులు
- పట్టుబడిన వారందరినీ కోర్టులో హాజరుపరుస్తామని పోలీసుల వెల్లడి
- తాగి ప్రమాదాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

2



## హెజ్బొల్లాపై ఇజ్రాయెల్ భీకర దాడులు..


### 50కి పైగా స్థావరాలు ధ్వంసం

- లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ భీకర దాడులు
- ఆదివారం ఉదయం 50కి పైగా కీలక కేంద్రాలను ధ్వంసం చేసినట్లు వెల్లడి
- ఆయుధాగారాలు, కమాండ్ సెంటర్లే లక్ష్యంగా వైమానిక దాడులు
- ఇజ్రాయెల్‌పై రాకెట్లు, డ్రోన్లతో హెజ్బొల్లా ప్రతిదాడులు
- దాడుల్లో పదుల సంఖ్యలో మరణాలు సంభవించినట్లు లెబనాన్ వర్గాల సమాచారం

2




## తెలంగాణలో పలు జిల్లాలో భారీ వర్షం.. ఈదురుగాలుల బీభత్సం



2

## కవిత పార్టీపై కేఏ పాల్ ఆసక్తికర వ్యాఖ్యలు

- కవితతో పార్టీ ఎవరు పెట్టించారో అందరికీ తెలుసన్న కేఏ పాల్
- అందుకే ఆ పార్టీలో మాజీలు చేరడం లేదని వ్యాఖ్య
- కవిత సీఎం పదవి అడిగితే తండ్రి నిరాకరించారన్న పాల్
- యుద్ధం ఆపేందుకు ట్రంప్‌తో చర్చలు జరిపే పనిలో ఉన్నానన్న కేఏ పాల్



2

హైదరాబాద్ పల్స్,డెస్క్

తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కవితపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సంచలన ఆరోపణలు చేశారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన కవిత ఏర్పాటు చేసిన పార్టీపై స్పందిస్తూ ఓ వీడియోను విడుదల చేశారు. ఆమెతో

## ఆధార్ కార్డు డిజైన్ మారుతుందా?

### కేంద్రం ఏం చెబుతోందంటే...!

- ఆధార్ కార్డు ఫార్మాట్ మారుతుందన్న వార్తల్లో నిజం లేదని కేంద్రం స్పష్టం చేసింది
- ఫోటో, క్యూఆర్ కోడ్‌తో కొత్త కార్డు వస్తుందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవం
- ఆధార్ కార్డులో మార్పులు చేసే ప్రతిపాదన ఏదీ పరిశీలనలో లేదు
- వదంతులు నమ్మవద్దని, ప్రజలు గందరగోళానికి గురికావొద్దని సూచన
- అధికారిక సమాచారం కోసం యూఐడీఏఐని సంప్రదించాలని విజ్ఞప్తి




2

## కేసీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు



2

## విశాఖలో ఘోర ప్రమాదం..

### గాజువాకలో కుప్పకూలిన రెండంతస్తుల భవనం




2

# 700 మందికి పైగా

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో వారాంతంలో నిర్వహించిన స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో భారీ సంఖ్యలో మందుబాబులు పట్టుబడ్డారు. రెండు కమిషనరేట్లలో కలిపి మొత్తం 728 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు మే 1, 2 తేదీల్లో నిర్వహించిన తనిఖీల్లో 445 మందిని పట్టుకున్నారు. వీరిలో 371 మంది ద్విచక్ర వాహనదారులు, 26 మంది త్రీవీలర్ వాహనదారులు, 48 మంది కార్లు, ఇతర వాహనాల డ్రైవర్లు ఉన్నారు. పట్టుబడిన వారి బ్లడ్ ఆల్కహాల్ కంటెంట్ (బీఏసీ) స్థాయిల ఆధారంగా కేసులు నమోదు చేసినట్లు జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) తెలిపారు. మరోవైపు, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 283 మంది పట్టుబడ్డారు. వీరిలో 227 మంది టూ-వీలర్ డ్రైవర్లు, 39 మంది కార్ డ్రైవర్లు, 9 మంది త్రీ-వీలర్, 8 మంది భారీ వాహన డ్రైవర్లు ఉన్నారు. పట్టుబడిన వారందరినీ కోర్టులో హాజరుపరుస్తామని అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. హనుమంతరావు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు కీలక హెచ్చరికలు జారీ చేశారు. మద్యం సేవించి వాహనం నడిపి ప్రాణాంతక ప్రమాదాలకు కారణమైతే, భారతీయ న్యాయ సంహిత, 2023లోని సెక్షన్ 105 కింద కేసు నమోదు చేస్తామని సైబరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. ఈ సెక్షన్ ప్రకారం గరిష్టంగా 10 సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో జీరో టాలరెన్స్ విధానాన్ని పాటిస్తామని, ఈ స్పెషల్ డ్రైవ్‌లు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

# కవిత పార్టీపై కేఏ పాల్ ఆసక్తికర వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

పార్టీని ఎవరు పెట్టించారో అందరికీ తెలుసని, అందుకే మాజీ ప్రజాప్రతినిధులు ఎవరూ ఆ పార్టీలో చేరడం లేదని అన్నారు. అవినీతి, కుటుంబ, కుల పార్టీలను ఎవరూ నమ్మవద్దని కోరారు. ఆమె స్థాపించిన పార్టీ వల్ల ఎవరికీ ప్రయోజనం లేదని విమర్శించారు. కేవలం తండ్రితో ఉన్న గొడవ కారణంగానే ఆమె పార్టీని ఏర్పాటు చేశారు తప్ప మరో కారణం లేదని అన్నారు. తాను అమెరికా పర్యటనలో బిజీగా ఉన్నానని, అందువల్లే తెలంగాణ రాజకీయాలపై దృష్టి సారించలేకపోయానని పేర్కొన్నారు. గతంలో కవిత తన తండ్రిని ముఖ్యమంత్రి పదవి అడిగారని, అందుకు కేసీఆర్ నిరాకరించారని పేర్కొన్నారు. 2008లోనే కవిత తన వద్దకు వచ్చి పార్టీ కోసం రూ. 10 కోట్లు ఇవ్వాలని అడిగారని, తాను రూ. 15 కోట్లు ఇవ్వాలనుకున్నానని చెప్పారు. కానీ కవితకు ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దని కేసీఆర్ కోరడంతో ఆగిపోయానని చెప్పారు. తన ఆస్తులను కాపాడుకోవడం కోసమే కవిత పార్టీని ఏర్పాటు చేశారని ఆరోపించారు. దోచుకున్న డబ్బుల విషయంలో షర్మిలకు ఎలాగైతే అన్నతో విబేధాలు వచ్చాయో, కవితకు తన కుటుంబంతో అలాగే వచ్చాయని అన్నారు.

**అమెరికా, ఇరాన్ యుద్ధంపై..**

అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య జరుగుతోన్న యుద్ధాన్ని ఆపేందుకు తాను డొనాల్డ్ ట్రంప్‌తో చర్చలు జరిపే పనిలో ఉన్నానని అన్నారు. ఈ యుద్ధం ఆగకపోతే ప్రపంచవ్యాప్తంగా ఉన్న 850 కోట్ల మంది తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్‌తో పాటు ఎందరో దేశాధినేతలు తన సలహాలు, సూచనలు తీసుకుంటారని వ్యాఖ్యానించారు. తాను అప్పులు తీసుకువచ్చి తెలుగు రాష్ట్రాలను అభివృద్ధి చేయగలనని చెప్పారు.

# ఆధార్ కార్డు డిజైన్ మారుతుందా?

మొదటి పేజీ తరువాయి

ఆధార్ కార్డు డిజైన్/ఫార్మాట్ త్వరలో మారబోతోందని, కేవలం ఫోటో, క్యూఆర్ కోడ్‌తో మాత్రమే కొత్త కార్డు అందుబాటులోకి వస్తుందని జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సోషల్ మీడియా, కొన్ని వార్తా కథనాల్లో వస్తున్న ఈ ఊహాగానాలను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆదివారం ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఆధార్ కార్డు రూపురేఖలు మారనున్నాయంటూ వస్తున్న వార్తలు ప్రజల్లో అనవసర గందరగోళాన్ని సృష్టిస్తున్నాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది. “ఆధార్ కార్డులో మార్పులు తీసుకువచ్చే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వ పరిశీలనలో లేదు. ప్రస్తుత ఫార్మాట్‌లోనే ఆధార్ కార్డు కొనసాగుతుంది” అని ఆ ప్రకటనలో స్పష్టం చేసింది. ఇలాంటి తప్పుడు సమాచారాన్ని ప్రజలు నమ్మవద్దని సూచించింది. ఆధార్‌కు సంబంధించిన ఏదైనా అధికారిక సమాచారం కోసం భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) వెబ్‌సైట్, అధికారిక సోషల్ మీడియా ఖాతాలు లేదా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ద్వారా వెలువడే ప్రకటనలను మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ధ్రువీకరణ లేని సమాచారాన్ని ప్రసారం చేయవద్దని మీడియా సంస్థలకు కూడా హితవు పలికింది. ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థగా ఉన్న ఆధార్‌కు దేశంలో అత్యంత ప్రాధాన్యత ఉంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, దేశవ్యాప్తంగా సుమారు 134 కోట్ల మంది ఆధార్ వాడుతుండగా, ఇప్పటివరకు 17,000 కోట్లకు పైగా లావాదేవీల కోసం దీనిని వినియోగించారు.

# హెజ్బొల్లాపై ఇజ్రాయెల్ భీకర దాడులు..

మొదటి పేజీ తరువాయి

ఇజ్రాయెల్, హెజ్బొల్లా మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రస్థాయికి చేరాయి. లెబనాన్‌లోని హెజ్బొల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) భీకర దాడులు నిర్వహించింది. ఈరోజు తెల్లవారుజామున జరిపిన ఈ దాడుల్లో 50కి పైగా కీలక మౌలిక సదుపాయాల కేంద్రాలను ధ్వంసం చేసినట్లు ప్రకటించింది. దక్షిణ లెబనాన్, బెకా వ్యాలీలోని హెజ్బొల్లా స్థావరాలే లక్ష్యంగా ఈ వైమానిక దాడులు జరిగినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. గత 24 గంటల్లోనే సుమారు 50 లక్ష్యాలపై దాడి చేశామని ఐడీఎఫ్ శనివారం ప్రకటించింది. ఈ వారాంతంలో మొత్తం 70 సైనిక నిర్మాణాలు, 50 మౌలిక సదుపాయాల సైట్‌లతో కలిపి 120 టార్గెట్లను ధ్వంసం చేసినట్లు మరో నివేదిక పేర్కొంది. హెజ్బొల్లాకు చెందిన కమాండ్ సెంటర్లు, ఆయుధాగారాలు, సైనిక భవనాలను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ తెలిపింది. తమ దేశ పౌరులు, సైనికులపై దాడులను అడ్డుకోవడానికే ఈ ఆపరేషన్ చేపట్టినట్లు స్పష్టం చేసింది. ఆదివారం ఉదయం కూడా దాడులు కొనసాగాయని పేర్కొంది. ఇజ్రాయెల్ దాడులకు ప్రతిగా హెజ్బొల్లా కూడా ఇజ్రాయెల్‌పైకి రాకెట్లు, డ్రోన్లతో దాడులు చేసింది. మరోవైపు, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 12 మంది వరకు మరణించినట్లు లెబనాన్ ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. అయితే, మృతుల్లో ఎంతమంది పౌరులు, ఎంతమంది మిలిటెంట్లు ఉన్నారనే దానిపై స్పష్టత లేదు. దాడులకు ముందు పలు గ్రామాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరికలు జారీ చేసింది. ఇరుపక్షాల దాడులు, ప్రతిదాడులతో సరిహద్దు ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# కేసీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

నిజామాబాద్, మే 03: నిజామాబాద్‌లో ఎంపీ ధర్మపురి అర్వింద్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం, ప్రతిపక్ష నేత కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రంలో రూ. 8 వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారని ఆయన ప్రకటించారు. పసుపు రైతులకు మంచి మద్దతు ధర లభిస్తోందంటే దానికి కారణం ప్రధాని మోదీ మాత్రమేనని స్పష్టం చేశారు. ‘కేసీఆర్‌కు మతిభ్రమించింది. నమ్మిన నాయకులను మోసం చేయడం ఆయనకు అలవాటు. బీఆర్ఎస్‌లో చేరిన జీవన్‌రెడ్డిని కూడా కేసీఆర్ మోసం చేస్తారు, కేసీఆర్ శకం ముగిసిపోయింది. గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ స్థాయిలో మత్తు పదార్థాలను సరఫరా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలనపై పట్టు లేదు. రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను కూడా మరచిపోయారు. ధాన్యం కొనుగోళ్లలో తీవ్రస్థాయిలో జాప్యం జరుగుతోంది. రైతు పండించిన ప్రతి ధాన్యం గింజను వారం రోజుల్లోగా కొనుగోలు చేయాలని బీజేపీ అల్టిమేటం జారీ చేసింది. సరైన సమయంలో కొనుగోళ్లు జరగకపోతే రాష్ట్రంలో రైతాంగం నుంచి పెద్దఎత్తున ఉద్యమం వస్తుంది’ అని అన్నారు.

# తెలంగాణలో పలు జిల్లాలో భారీ వర్షం.. ఈదురుగాలుల బీభత్సం

మొదటి పేజీ తరువాయి

నల్లగొండ, మే 03: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా తీవ్ర ఎండలు, ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు ఈ వర్షం కొంత ఉపశమనాన్ని కలిగించినప్పటికీ, ఈదురుగాలుల బీభత్సం వల్ల పలు ప్రాంతాల్లో తీవ్ర నష్టం వాటిల్లింది. నల్లగొండ జిల్లాలో చాలా చోట్ల ఐకేపీ సెంటర్లలో ధాన్యం తడిసి ముద్దయింది. హాలియా నుంచి నల్గొండ వెళ్ళే ప్రధాన రహదారిపై పలు చోట్ల విరిగిపడ్డ చెట్లు విరిగిపడ్డాయి. తిప్పర్తి మండలంలో అద్దంకి -నార్కట్ పల్లి ప్రధాన హైవేపై చెట్లు విరిగిపడటంతో అరగంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నకిరేకల్, కట్టంగూర్, కేతెపల్లి మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. ఉమ్మడి వరంగల్, సూర్యపేట, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సిద్ధిపేట జిల్లాలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులుతో కూడిన భారీ వడగళ్ల వాన పడింది. భారీ వర్షాలకు చేతికొచ్చిన పంటలు దెబ్బతినడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాల నేపథ్యంలో ప్రజలు, రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు

# సీఎం, మంత్రులు రోడ్లపై తిరగలేరు..

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఘాటైన బహిరంగ లేఖ రాశారు. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో 7ను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని అన్నారు. సీఎం, మంత్రులు రోడ్లపై తిరగలేరని ఆయన హెచ్చరించారు. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో విద్యావ్యవస్థను పూర్తిగా కుప్పకూల్చారని కేటీఆర్ తన లేఖలో తీవ్రస్థాయిలో విమర్శించారు. “ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 7 ముమ్మాటికీ ఫీజుల పథకానికి పాతరేసేందుకు చేస్తున్న కుటిల ఎత్తుగడ. దీనివల్ల 14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్తుంది. ఇది నిరుపేద విద్యార్థులను ఉన్నత చదువులకు దూరం చేసే వెన్నుపోటు చర్య” అని కేటీఆర్ అభివర్ణించారు. విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ఈ జీవోను వెంటనే వెనక్కి తీసుకుని, విద్యార్థి లోకానికి క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా కొనసాగించిందని గుర్తుచేశారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ పథకానికి గ్రహణం పట్టిందని విమర్శించారు. గత రెండున్నరేళ్లుగా సుమారు 10 వేల కోట్ల రూపాయల ఫీజు బకాయిలను చెల్లించలేదని, ఇప్పుడు విద్యార్థుల ఖాతాల్లో నేరుగా డబ్బులు వేస్తామంటే ఎవరూ నమ్మరని కేటీఆర్ అన్నారు. బకాయిలు పేరుకుపోవడంతో 2500కు పైగా కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. నిధులు అడిగిన వారిని వన్-టైమ్ సెటిల్మెంట్, టోకెన్ల పేరుతో మభ్యపెట్టారని, నిరసన తెలిపితే విజిలెన్స్ దాడులతో బెదిరించారని ఆరోపించారు. ప్రభుత్వ అసమర్థ పాలన వల్లే గురుకులాల్లో 142 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని, ఇప్పటికీ వేలాది మంది సరైన భోజనం లేక ఆసుపత్రుల పాలవుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. “ఒకవైపు 3.75 లక్షల కోట్ల అప్పులు చేసిన ప్రభుత్వం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు మాత్రం ఒక్క రూపాయి విడుదల చేయకపోవడం దుర్మార్గం. రైతుబంధును మూడుసార్లు ఎగ్గొట్టి రైతులను దగా చేశారు. ఇప్పుడు ఫీజుల పథకానికి మంగళం పాడేందుకు దొడ్డిదారులు వెతుకుతున్నారు” అని కేటీఆర్ దుయ్యబట్టారు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే తీవ్ర పరిణామాలుంటాయని కేటీఆర్ హెచ్చరించారు. “ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ చీకటి జీవోను వెంటనే రద్దు చేయాలి. లేదంటే 14 లక్షల మంది విద్యార్థులతో కలిసి కాంగ్రెస్ సర్కారుపై సమరశంఖం పూరిస్తాం. ఇప్పటికే రైతుల ఆందోళనలతో రాష్ట్రం అట్టుడుకుతోంది. దీనికి విద్యార్థుల ఆగ్రహం కూడా తోడైతే ముఖ్యమంత్రి, మంత్రులు రోడ్లపై తిరగలేని పరిస్థితి వస్తుంది” అని కేటీఆర్ తన లేఖలో స్పష్టం చేశారు.

# కరీంనగర్ లో దొంగల బీభత్సం...

మొదటి పేజీ తరువాయి

జరగడం బాధాకరమని ఆయన అన్నారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. ఈ దారుణానికి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షిస్తామని కరీంనగర్ ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు. వివరాల్లోకి వెళితే, ఐదుగురు సాయుధ దుండగులు కస్టమర్ల రూపంలో జువెలరీ షాపులోకి ప్రవేశించారు. బంగారు ఆభరణాలు చూపించమని కోరారు. సిబ్బంది నగలు బయటికి తీయగానే, తుపాకులతో బెదిరించి దోపిడీకి యత్నించారు. సిబ్బంది ప్రతిఘటించడంతో దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో సేల్స్ మేనేజర్‌తో పాటు ఇతర ఉద్యోగులు గాయపడ్డారు. గాయపడిన సిబ్బందిని, పోలీసు అధికారులను కలిసి వివరాలు తెలుసుకున్నట్లు బండి సంజయ్ తెలిపారు. క్షతగాత్రులకు ప్రాణాపాయం లేదని, మెరుగైన చికిత్స కోసం వారిని హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. కరీంనగర్ పోలీసులు తక్షణమే స్పందించారని, పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో నిందితుల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారని వివరించారు. సీసీటీవీ ఫుటేజీని విశ్లేషిస్తూ అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారని, నిందితులను పోలీసులు త్వరలోనే పట్టుకుంటారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# విశాఖలో ఘోర ప్రమాదం..

## గాజువాకలో కుప్పకూలిన రెండంతస్తుల భవనం

మొదటి పేజీ తరువాయి

గాజువాక, మే 03: విశాఖపట్నం జిల్లా గాజువాక పరిధిలోని వికాస్ నగర్‌లో ఆదివారం ఒక విషాద ఘటన చోటుచేసుకుంది. జాకీల సాయంతో ఇంటిని పైకి లేపే క్రమంలో రెండంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. వికాస్ నగర్‌లో ఒక పాత భవనాన్ని ఆధునీకరించే క్రమంలో, పునాదుల నుంచి ఇంటిని పైకి లేపేందుకు యజమాని ప్రయత్నించారు. అయితే, పనులు జరుగుతుండగా భవనం ఒక్కసారిగా పేకమేడలా కూలిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించారు. న్యూ పోర్ట్ పీఎస్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, భవన యజమాని, పనులు చేపట్టిన కాంట్రాక్టర్ అనుమతులు తీసుకున్నారా లేదా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

# నేడే కౌంటింగ్...బెంగాల్, తమిళనాడు పైనే అందరి దృష్టి

మొదటి పేజీ తరువాయి

కూటమి సునాయాసంగా అధికారాన్ని నిలబెట్టుకుంటుందని, పుదుచ్చేరిలో ఎన్డీయే కూటమికే విజయావకాశాలున్నాయని అంచనాలు వెలువడ్డాయి.

తమిళనాడులో భారీ ఏర్పాట్లు

తమిళనాడులో 234 అసెంబ్లీ స్థానాల ఓట్ల లెక్కింపు కోసం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అర్చన పట్నాయక్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 62 కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు, 8:30 గంటల నుంచి ఈవీఎంల లెక్కింపు మొదలవుతుంది. ఈ ప్రక్రియ కోసం సుమారు 1.25 లక్షల మంది సిబ్బందిని, లక్ష మంది పోలీసులను మోహరించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. బయటి వలయంలో స్థానిక పోలీసులు, గేట్ల వద్ద రాష్ట్ర సాయుధ పోలీసులు, కౌంటింగ్ హాళ్లు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కేంద్ర సాయుధ పోలీసు బలగాలు పహారా కాయనున్నాయి. తొలిసారిగా, క్యూఆర్ కోడ్ ఆధారిత ఫొటో గుర్తింపు వ్యవస్థ ద్వారా మాత్రమే కేంద్రాల్లోకి అనుమతిస్తారు.

పశ్చిమ బెంగాల్‌లో ప్రత్యేక చర్యలు

పశ్చిమ బెంగాల్‌లోనూ ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 77 కౌంటింగ్ కేంద్రాల్లో లెక్కింపు జరగనుంది. అయితే, ఫాల్టా నియోజకవర్గంలో మే 21న రీపోలింగ్ ప్రకటించినందున, సోమవారం 294 స్థానాలకు గాను 293 స్థానాలకే ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఫాల్టా ఫలితాలు మే 24న వెలువడనున్నాయి. బెంగాల్‌లో కూడా మూడంచెల భద్రతను అమలు చేస్తున్నారు. కౌంటింగ్ రూమ్‌లలోకి కేవలం కేంద్ర బలగాలను, బయట రాష్ట్ర, కేంద్ర బలగాలను మోహరించారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లను పూర్తిగా నిషేధించారు. 2021 ఎన్నికల తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలను దృష్టిలో ఉంచుకుని, తదుపరి ఆదేశాలు వచ్చేవరకు రాష్ట్రంలో 700 కంపెనీల కేంద్ర బలగాలను కొనసాగించాలని ఈసీ నిర్ణయించింది. మొత్తం మీద, సోమవారం ఉదయం లెక్కింపు ప్రారంభమై, సాయంత్రానికి ఫలితాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# ఉద్యోగాన్ని ప్రేమిస్తూ... ఉద్యోగుల కోసం పోరాటం చేస్తూ....

## 15 సంవత్సరాల శ్రమ ఫలితం ఇంజ మహేష్ కు శ్రమశక్తి అవార్డు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** పూర్తి పేరు: ఇంజ మహేష్
తల్లిదండ్రులు: లక్ష్మి, నరసయ్య
పుట్టిన తేదీ: జనవరి 09,1988
కులం: ఎస్సీ ( మాదిగ)
ప్రస్తుత పదవి: ఐ ఎన్ టి యు సి-327 యాదాద్రి భువనగిరి జిల్లా ట్రెజరర్
విద్య అర్హతలు: ఐటిఐ, డిగ్రీ బీకాం
గ్రామం: కాల్వపల్లి
మండలం: రాజపేట
నియోజకవర్గం: ఆలేరు
జిల్లా: యాదాద్రి భువనగిరి
ఫోన్ నెంబర్: 7893894184

అతిపెద్ద దళిత కుటుంబంలో జన్మించిన పెద్ద మనసు గల ఇంజ మహేష్ చిన్నప్పటినుండి కష్టపడి పనిచేసే వ్యక్తిత్వంతో పాటు ఇతరుల కోసం ఆలోచించి సాయం చేసే మంచి మనస్కుడు. ఏ సందర్భంలోనైనా అట్టి పరోపకార సేవను వదిలిపెట్టక పోవడంతో నేడు శ్రమశక్తి అవార్డుకు అర్హత పొందాడు. ఉద్యోగ జీవిత విధానం పరిశీలిస్తే మొట్టమొదటిగా , 04 జనవరి 2011 న రాజపేట మండలం పాముకుంట సబ్ స్టేషన్ లో, ఆపరేటర్ గా ఉద్యోగం చేరాడు . 2011 నుండి ఔట్సోర్సింగ్ విధులు నిర్వహిస్తూ, 2016లో ఐ.ఎన్.టి.యు.సి-327 యూనియన్ లో జాయిన్ అయ్యాడు. అనంతరం ఆలేరు సబ్ డివిజన్ లీడర్ గా ఎన్నుకున్నారు. 2017 న ఔట్సోర్సింగ్ ఉద్యోగం కాస్త ఆర్టిజన్ గా మార్చారు. 2020 సంవత్సరంలో తాను యూనియన్ కి, కార్మికులకు చేసిన సేవలను గుర్తించి , భువనగిరి డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నుకున్నారు. ఆ తర్వాత ఆర్టిజన్ల గురించి నిత్యం పోరాడుతున్నాడని గుర్తించి, 2025 వ సంవత్సరంలో యాదాద్రి భువనగిరి జిల్లా ట్రెజరర్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల జరిగిన ఆర్టిజన్ కార్మికుల సమ్మెకు, రాష్ట్ర కమిటీ మేరకు, మహేష్ కు భువనగిరి డివిజన్, తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్, జాయింట్ యాక్షన్ కమిటీ భువనగిరి డివిజన్ చైర్మన్గా ఎన్నుకున్నారు. ఆర్టిజన్ కార్మికుల వెంట ఉండి, శాంతియుతంగా, జరిగిన పది రోజుల సమ్మెకు పూర్తి బాధ్యత వహించి, సమ్మె సక్సెస్ చేసాడు .2016 నుండి 2026 వరకు అనునిత్యం కార్మికుల కోసమే కష్టపడుతున్నానని తెలిసి, యూనియన్ కంపెనీ నాయకులు, రాష్ట్ర నాయకులు 1 మే 2026న, కార్మికుల దినోత్సవం పురస్కరించుకొని, ఇంజ మహేష్ ను శ్రమశక్తి అవార్డు గ్రహీతగా ఎన్నుకున్నారు. ఇలా ఇంజ మహేష్ వృత్తిలో పరిణతి చెందుతూ, నమ్ముకున్న సంఘాన్ని కార్మికుల కోసం నిత్యం ఆలోచిస్తూ పోరాటాలు ఉద్యమాలు నడుపుచు ఉద్యోగరీత్యా సంఘపక్షాన ఉన్నత పదవులు అధిరోహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చే శ్రమశక్తి అవార్డును అందుకోవడం పట్ల ప్రతి ఒక్కరు ఆయనను అభినందించారు. ఇంతటితోనే ఆగకుండా ఉద్యోగ, నాయకత్వ రీత్యా మరిన్ని శిఖరాలు మహేష్ తప్పకుండా అధిరోహిస్తారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.






# రోడ్డు తెగిపోయి నేటికీ 45 రోజులు

**డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్**
**ప్రజలు అవస్థలు పడుతున్న, ఆందోళనలు కొనసాగిస్తున్న విపక్ష పార్టీలు పట్టించుకొని ప్రభుత్వం**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం కాల్వపల్లి పొట్టిమర్రి మధ్య గల వాగుపై నిర్మించిన డైవర్షన్ తాత్కాలిక రోడ్డు తెగిపోయి 45 రోజులు కావస్తోంది. అన్ని విపక్ష పార్టీలు గగ్గోలు పెడుతున్నప్పటికీ ఫలితం కానరావడం లేదు. రాజపేట మండల కేంద్రానికి రాజపేట నుండి ఇతర ప్రాంతాలకు 90% పైగా ఇదే మార్గాన అనేకమంది ప్రయాణిస్తున్నప్పటికీ సంబంధిత ఐ.బి, ఆర్అండ్బి అధికారులు చలించడం లేదు. తుంగతుర్తి నియోజకవర్గానికి కాలేశ్వరం నీటిని పంపేందుకు నీటిని విడిచిపెట్టగా అధికారుల అనాలోచిత నిర్ణయం ఫలితంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు తెగిపోయింది. బిజెపి, బిఆర్ఎస్, సీపీఐ ప్రధాన పార్టీలు తమదైన శైలిలో నిరసనలు ఆందోళనలు చేపట్టినప్పటికీ తాత్కాలిక డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేయకపోవడం అధికారులు మాత్రం స్పందించకపోవడం పట్ల ప్రజలు ప్రయాణికులు, ఆగ్రహం చెందుతున్నారు. కుంటి సాకులు చెబుతూ 45 రోజులు గడిపారని విమర్శిస్తున్నారు. పరిస్థితి విషమించక ముందే అధికారులు మేల్కొంటే బాగుంటుందని, లేనిపక్షంలో విపక్ష పార్టీల తీవ్ర ఆందోళనలకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రజలు హెచ్చరిస్తున్నారు. వాగు వద్ద, విలేకరుల సమావేశాల ద్వారా, వినతి పత్రాల ద్వారా మూడు పార్టీలు ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకొచ్చినప్పటికీ 45 రోజులుగా స్పందించకపోవడం విడ్డూరమన్నారు. డైవర్షన్ రోడ్డు తెగిపోయినప్పటి నుండి ప్రయాణికుల బాధలు, బస్సులు రద్దు కావడంతో ప్రజల ఇబ్బందులు ఉన్నాయి. ఆందోళన తీవ్రతరం కాకముందే పొట్టిమర్రి వద్ద రాకపోకలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



# పారుపల్లి ఉన్నత పాఠశాల ప్రత్యేకతే వేరు

**వరుసగా 8వ, సారి నూరు శాతం ఉత్తీర్ణత**
**జిల్లాలోనే అత్యధికంగా ఇన్స్ పైర్ అవార్డులకు ఎంపిక**
**హెచ్ఎం బుస్సా రమేష్ బృందం పనితీరు ఆదర్శం**


**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం పారుపల్లి ఉన్నత పాఠశాల ప్రత్యేకతే వేరు. జిల్లాలోని ప్రత్యేక అత్యుత్తమ ఫలితాలను సాధించుకుంటూ పాఠశాలలకు ఆదర్శంగా నిలిచింది. జిల్లా విద్యాధికారి కందుల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎంఈఓ చందా రమేష్ పర్యవేక్షణలో పూర్తి అదనపు ప్రధానోపాధ్యాయుని బాధ్యతలు చేపట్టిన బుస్సా రమేష్ నాయకత్వంలో ఉపాధ్యాయ బృందం చేసిన కృషి ఉత్తమ ఫలితాలకు అద్దం పట్టింది. 2018 - 19 విద్యా సంవత్సరం నుండి ఇప్పటివరకు వరుసగా 8సార్లు ఎస్ఎస్సి ఫలితాలు నూరు శాతం సంపాదించుకుంటూ జిల్లాలోనే మొదటి పాఠశాలగా ప్రత్యేక గుర్తింపు పొందింది. అంతేకాకుండా నాలుగు ఇన్స్పైర్ అవార్డుల దక్కించుకొని జిల్లాలోనే పారుపల్లి పాఠశాల మొదటి స్థానంలో నిలిచింది. 2025 - 26 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్సి నూరు శాతం ఉత్తీర్ణత తోపాటు మొత్తం 13 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం మరో ప్రత్యేకత. ఇందులో నలుగురు 500 మార్కులకు పైగా సాధించడంతో 522 అత్యధిక మార్కులతో వైష్ణవి పాఠశాల స్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. అంతే కాకుండా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలో చేరే విధంగా హెచ్ఎమ్ బుస్సా రమేష్, ఉపాధ్యాయులు వి.కృపాచారిని, పి.రాంప్రసాద్, జి.రవళి, ఎం.గోపాల్ కిషన్ రావు, జి.నర్మద, పి.రజని బృందం శ్రమ పట్టుదల ఉత్తమ ఫలితాలకు దారులు వేశాయి. ఈ సందర్భంగా సర్పంచి మోత్కుపల్లి జ్యోతి ప్రవీణ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందాన్ని, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల పెద్ద ప్రధానోపాధ్యాయుని పోస్ట్ ఖాళీగా ఉన్నప్పటికీ సీనియర్ స్కూల్ అసిస్టెంట్ బుస్సా రమేష్ పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించి తోటి ఉపాధ్యాయ బృందంతో కలిసి శ్రమించడం వల్లే అత్యుత్తమ ఫలితాలు వచ్చాయని సర్పంచ్ కితాబిచ్చారు.



### స్వీయ గణన ద్వారా కుటుంబ వివరాలు

# నమోదు చేసుకోండి: కలెక్టర్ ప్రతీక్ జైన్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**
జనాభా లెక్కల ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) విధానం ద్వారా ప్రజలు తమ కుటుంబ వివరాలను తామే నమోదు చేసుకునే అవకాశం కల్పించిందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ఈ ప్రక్రియ మే 10 వరకు కొనసాగుతుందని, జిల్లాలోని ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ వివరాలను ఆన్లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజలు స్వయంగా వివరాలు నమోదు చేయడం వల్ల సమయం ఆదా కావడంతో పాటు సమాచార ఖచ్చితత్వం పెరుగుతుందని పేర్కొన్నారు. ఇందుకోసం https://se.census.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ అయి కుటుంబ పెద్ద పేరు, మొబైల్ నంబర్, ఓటీపీ ధృవీకరణ అనంతరం జిల్లా, గ్రామం/పట్టణం, పిన్ కోడ్, లొకేషన్ వివరాలు నమోదు చేసి ఇళ్లకు సంబంధించిన 33 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి సబ్మిట్ చేయాలని తెలిపారు. సబ్మిట్ చేసిన తర్వాత లభించే 11 అంకెల సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడిని భద్రపరచుకోవాలని, మే 11 తర్వాత గణనాధికారి ఇంటికి వచ్చినప్పుడు ఆ ఐడిని చూపించి ధృవీకరణ పొందవచ్చని వివరించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించి తమ కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ విజ్ఞప్తి చేశారు.



## ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

### సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచి రోజులు గడుస్తున్నాయి కానీ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయలేదని ప్రభుత్వం ఏసీ గదుల్లో సమీక్షలు మానేసి రైతుల మధ్యకు రావాలని రఘునాథపురం గ్రామ సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ విమర్శించారు. గ్రామంలోని ఐకెపి సెంటర్ ను సందర్శించి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని అధికారులతో మాట్లాడారు .రోడ్లపై, ఐకేపీ సెంటర్లలో రైతులు అవస్థలు పడుతున్నారని, అకాల వర్షాలు కూడా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు చెప్పారు. రైతు కన్నీళ్లు ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదని మాటల వరకే పరిమితం అయ్యారన్నారు. ధాన్యం చివరి గింజ కొనేవరకు రైతుల పక్షాన పోరాటం కొనసాగుతుందని కొనుగోలు ప్రక్రియ ఇదే విధంగా కొనసాగితే మరో రెండు నెలల వరకు కూడా పూర్తి కాదన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ తుంగ అక్షయ్ కుమార్, బొద్దుల వెంకటేశం, కటకం చిన్న వెంకటేశం, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# రాజపేటలో బిజెపి మండల పార్టీ సమావేశం

**స్థానిక సమస్యలపై పోరాటం చేయాలని పిలుపు**
**గ్రామస్థాయిలో శాఖల అధ్యక్షులు స్పందించాలన్న మేకల రమేష్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట భారతీయ జనతాపార్టీ మండల శాఖ అధ్యక్షులు మేకల రమేశ్ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు మేకల రమేశ్ మాట్లాడుతు... రైతుల వడ్లు కొనుగోలు వేగవంతం చేయడానికి ఐకేపీ సెంటర్ ల వద్ద గ్రామ శాఖ అధ్యక్షులు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయాలని, ప్రధానమంత్రి నరేంద్రమోడి బహిరంగ సభ కి పెద్ద ఎత్తున తరలి రావాలని, పొట్టిమర్రి వాగు వద్ద తాత్కాలిక రోడ్డు నిర్మించడంలో జాప్యం చేస్తున్నందుకు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇంటిని పెద్ద ఎత్తున తరలివెల్లి ముట్టడించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మెండు భగవాన్ రెడ్డి, సీనియర్ నాయకులు దాచేపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు బొంగొని నర్సిములు, పట్టణ అధ్యక్షులు సాధనబోయిన శెంకర్, కుమ్మరి లక్ష్మణ్, బీజేవైఎం నాయకులు బూర్గు శేకర్ రెడ్డి, అంకతి భాస్కర్, రేగొండ మాదవులు, బెడిద కృష్ణ, చిగుల్ల బీరయ్య, బండి సిద్దులు, దిడ్డి సత్తయ్య, పారుపల్లి సంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ గాయని పబ్బోజు శోభారాణికి సత్కారం




***హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :*** దత్తసేవరథం బుద్ధ పూర్ణిమ అవార్డు త్యాగరాయ గాన సభ మెయిన్ హాల్ లో శనివారం రాత్రి జరిగింది. రాజపేట కు చెందిన గాయని శోభారానికి జ్ఞాపకతో సన్మానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమానికి డి.ఎస్.ఆర్ ఫౌండేషన్ అధినేత శ్రవణాచార్యులు, లత, లక్ష్మీ, ప్రశాంతి, శకుంతల, దైవజ్ఞ శర్మ పబ్బోజు సాయిబాబా చార్యులు విశ్వకర్మ రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాథం, లక్ష్మణ్, సతీష్, పట్నాల సావిత్రి, మల్లెపూల వెంకటరమణ, పలువురు సినీ రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు

# రాజపేటలో రేపు హనుమాన్ భక్తులకు భిక్ష కార్యక్రమం

**మదర్ డైరీ డైరెక్టర్ సందిల భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో ఈనెల 5వ, తేదీ మంగళవారం హనుమాన్ మాల ధారణ భక్తులకు సామూహిక అన్న ప్రసాద వితరణ భిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు సంధిల రాంచందర్ మదర్ డైరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు హనుమాన్ స్వామి వారికి ప్రత్యేక భజన భక్తి గీతాలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు మాల ధారణ భక్తులకు సామూహిక భిక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ మాలాధారణ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. శ్రీ రామకృష్ణ సాయి మందిరం ఆలయ శాశ్వత అధ్యక్షులు నంగునూరి చంద్రశేఖర్, ఆలయ అభివృద్ధి కమిటీ, సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని సందిల భాస్కర్ గౌడ్ తెలిపారు.

# చెడదీపు సత్యనారాయణ కు దత్తసేవారథం సత్కారం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం బేగంపేట గ్రామానికి చెందిన చెడదీపు సత్యనారాయణ దత్త సేవరథం సంస్థ ద్వారా సత్కారం పొందారు. హైదరాబాదు త్యాగరాయ గానసభ లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సత్యనారాయణ పాల్గొని అన్నమయ్య సినిమాలోని "విన్నపాలు వినవలె" పాట అద్భుతంగా పాడారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, అతిధులు సత్యనారాయణ ను ప్రత్యేకంగా అభినందిస్తూ శాలువా జ్ఞాపకతో సత్కరించి ప్రశంసించారు.

# ధర్మమే జీవన మార్గం..!

**మహామండలేశ్వర్ డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్**

**వైభవంగా మృత్యుంజయ జపయజ్ఞం**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, జహీరాబాద్ :** మన జీవితాన్ని సత్యం, న్యాయం, సద్భావన, మానవత్వం, సేవాభావం, బాధ్యతతో నడిపించడమే నిజమైన జీవన విధానం అని, ప్రతి ఒక్కరూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలని మహామండలేశ్వర్, బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ సంస్థాన్ పీఠాధిపతి డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ అన్నారు. ఆదివారం బర్దిపూర్ దత్తక్షేత్రంలోని యజ్ఞశాలలో విశ్వంలోని సకల ప్రాణులకు మృత్యుభయం తొలగి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని కోరుతూ నిర్వహించిన మహా మృత్యుంజయ శత సహస్ర లక్ష జపయజ్ఞం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఉదయం 10:15 నిమిషాలకు ప్రారంభమైన యజ్ఞం మధ్యాహ్నం 1:55 నిమిషాలకు పూర్ణాహుతితో ముగిసింది. భక్తులు, వైదిక పాఠశాల విద్యార్థులు కలిసి మహా మృత్యుంజయ మంత్రాన్ని లక్షసార్లు జపించారు. దీంతో ఆశ్రమ పరిసరాలు వేదమంత్రాలతో మార్మోగాయి. తెలుగు రాష్ట్రాల భక్తులతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వచ్చిన భక్తులు కూడా యజ్ఞానికి హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ అనసూయ మాత, పీఠాధిపతులు అవధూతగిరి మహారాజ్, ఆనందగిరి మాత, నందినిగిరి మాత, అర్చకులు శ్రీపాద స్వామి, నాగయ్య స్వామి, వైదిక పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చేనేత రుణమాఫీలో చేతివాటం మధ్యవర్తులతో అధికారుల దోపిడీ

**ఇదెక్కడి న్యాయం అంటున్న లబ్ధిదారులు**

**కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలంలోని ఏడు గ్రామాలలో చేనేత కార్మికులకు మంజూరి అయిన రుణమాఫీ విషయంలో అధికారులు తమ చేతివాటం ప్రదర్శించారు. ఆదివారం లబ్ధిదారులైన చేనేత కార్మికులు తమ గోడును విలేకరులకు వెళ్ళబుచ్చుకున్నారు. లక్ష లోపు రుణాల మాఫీ ప్రభుత్వం ప్రకటించగా సంబంధిత చేనేత జౌళిశాఖ అధికారులు పర్సంటేజీ ఇస్తేనే చెక్కులు అందజేసినట్లు ఆరోపిస్తున్నారు. రాజపేట మండలంలోని రఘునాథపురం, చల్లూరు, బొందుగుల, సోమరం, రేణికుంట, దూది వెంకటాపురం, బేగంపేట, రాజపేట గ్రామాలలో చేనేత కార్మికులకు రుణమాఫీ అయింది. 2017 నుండి 2024 మార్చి 31 వరకు లక్షల లోపు రుణాలున్న కార్మికులకు ఇది వర్తించగా సుమారు 150 మందికి పైగా రుణమాఫీ జరిగినట్లు కార్మికులు చెబుతున్నారు. కాగా ఇట్టి రుణమాఫీ వర్తించేందుకు సంబంధిత చెక్కులు అధికారులు ఇచ్చేందుకు పలు గ్రామాలలో మధ్యవర్తులను ఏర్పాటు చేసుకున్న అధికారులు ఒక్కొక్కరి నుండి 5000 రూపాయలు కచ్చితంగా వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయాల చుట్టూ నెలలపాటు తిప్పించుకొని మధ్యవర్తులకు ముడుపులు ఇచ్చిన తర్వాతే తమకు రుణమాఫీ జరిగిందని చేనేత కార్మికులు వాపోతున్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా చరచూపి విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని చేనేత కార్మికులు కోరుతున్నారు

# మిషన్ దృష్టి సక్సెస్.. గెలాక్సీ ఐ శాటిలైట్‌ను కక్ష్యలో ప్రవేశపెట్టిన ఫాల్కన్ రాకెట్..



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, సెంట్రల్ డెస్క్:** భారతీయ అంతరిక్ష రంగం మరో కీలక మైలురాయిని అధిగమించింది. బెంగళూరుకు చెందిన స్టార్టప్ గెలాక్సీ స్పేస్ రూపొందించిన 'మిషన్ దృష్టి' శాటిలైట్‌ను ఆదివారం స్పేస్‌ఎక్స్ ఫాల్కన్-9 రాకెట్ ద్వారా విజయవంతంగా నింగిలోకి పంపింది. స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన ఈ ఉపగ్రహం గ్లోబల్ లాంచ్ ప్లాట్‌ఫామ్‌పై నుంచి ప్రయోగించడం విశేషం. 190 కిలోల బరువుతో రూపొందిన 'మిషన్ దృష్టి' ఉపగ్రహం ప్రైవేట్ రంగంలో భారత్‌లో తయారు చేసిన అతిపెద్ద ఉపగ్రహంగా గుర్తింపు పొందింది.అయితే, పరిమాణంలోనే కాకుండా వినూత్న ఇమేజింగ్ సాంకేతికతలోనూ దీనికి ప్రత్యేకత ఉన్నది. ఇందులో 'ఆప్టోసార్' అనే హైబ్రిడ్ వ్యవస్థను వినియోగించారు. ఇది ఆప్టికల్ ఇమేజింగ్, సింథటిక్ అపర్చర్ రాడార్ సాంకేతికతలను ఒకే ప్లాట్‌ఫామ్‌లో సమన్వయం చేస్తుంది. సాధారణంగా ఉపగ్రహాలు ఈ రెండు వ్యవస్థల్లో ఏదో ఒకదానిపై ఆధారపడుతుంటాయి. ఆప్టికల్ వ్యవస్థ ఫొటోల మాదిరిగా స్పష్టమైన, రంగుల చిత్రాలను ఇస్తాయి. కానీ, మేఘాలు.. చీకటి సమయంలో పనిచేయవు.రాడార్ వ్యవస్థలు మాత్రం మేఘాలను దాటి, రాత్రి వేళల్లో పనిచేస్తాయి. కాని వాటి చిత్రాలు అంత స్పష్టంగా రావు. ఈ లోపాన్ని అధిగమించేలా ఆప్టోసార్ వ్యవస్థ ఒకేసారి ఆప్టికల్, రాడార్ డేటాను సేకరించి, వాటిని సమ్మిళితం చేసి సమగ్ర ఫొటోను పంపుతుంది. ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా, పగలు-రాత్రి తేడా లేకుండా స్పష్టమైన సమాచారం అందుతుంది. ఈ సాంకేతికత సాధారణ ఉపగ్రహాల కంటే మూడింతలు ఎక్కువ ఉపయోగకరమైన డేటాను అందిస్తుంది. ప్రకృతి విపత్తుల నిర్వహణ, వ్యవసాయం, సరిహద్దు భద్రత, మౌలిక వసతుల ప్రణాళిక తదితర విభాగాల్లో ఈ ఉపగ్రహం కీలక పాత్ర పోషించనుంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ మిషన్, దేశ అంతరిక్ష యాత్రలో ఓ కీలక ఘట్టంగా అభివర్ణించారు

# గంప మనోహర్ ను పరామర్శించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరు అశోక్ గౌడ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆలేరు పట్టణం బిజెపి సీనియర్ నాయకుడు మాజీ మండల అధ్యక్షుడు గంప మనోహర్ తల్లి గంప వర్ధనమ్మ ఇటీవల స్వర్గస్తులైనరు. ఇందులో భాగంగా సీనియర్ నాయకులు గంప మనోహర్ ని ఆదివారం రోజు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరు అశోక్ గౌడ్ పరామర్శించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పన్నాల చంద్ర శేఖర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కదూరి అచ్చయ్య, జిల్లా కార్యదర్శి కామిటికారి కృష్ణ, జిల్లా నాయకులు మంగు నర్సింహులు, దయ్యాల కుమారస్వామి, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎలగల వెంకటేష్, మండల కార్యదర్శి బైరి మహేందర్ గౌడ్, ఓబీసీ పట్టణ అధ్యక్షులు ఎగ్గిడి సంపత్, కాంతుల శంకర్, వల్లపురెడ్డి దినేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అమీన్పూర్‌లో గ్రీన్ విల్లాస్‌కు సీసీ కెమెరాలు!

**మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, ఏసిపి శ్రీనివాస్ కుమార్ ప్రారంభించారు.**





**అమీన్పూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03 :** సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ డివిజన్ పరిధిలోని గ్రీన్ విల్లాస్ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, ఏసిపి శ్రీనివాస్ కుమార్ లు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి మాట్లాడుతూ, గతంలో అమీన్పూర్ మున్సిపాలిటీ ఎంతో వెనుకబడి ఉండేదని, తమ హయాంలో గణనీయ అభివృద్ధి సాధించామని తెలిపారు. ప్రజల సమస్యలను తీర్చడమే ప్రజాప్రతినిధుల లక్ష్యంగా తమ బాధ్యత అని అన్నారు.గ్రీన్ విల్లాస్ కాలనీవాసులు సీసీ కెమెరాల ఏర్పాటుకు సహాయం చేసిన మాజీ చైర్మన్‌కు కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ శివకుమార్, మాజీ ప్రెసిడెంట్ సతీష్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నరేష్, సబ్ ఇన్స్పెక్టర్లు ప్రభాకర్, విజయ్, మాజీ కౌన్సిలర్లు కొల్లూరు చంద్రకళ గోపాల్, కృష్ణ, మాజీ కో-ఆప్షన్ సభ్యులు తల్లారి రాములు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.


# సామాన్యులకు బిగ్ షాక్.. పాల ధరలు భారీగా పెంపు..!!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, సెంట్రల్ డెస్క్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇప్పటికే దేశంలోని అనేక ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడింది. అలాగే గ్యాస్ సిలిండర్ సరఫరాలోనూ ఆలస్యం జరుగుతోంది. దాంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా ప్రాంతాల్లోని పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. అలాగ గ్యాస్ సిలిండర్ సరఫరాలో జాప్యం నెలకొంది. ఈ క్రమంలో తాజాగా పాల ధరలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఒక్కో లీటర్ పై రూ. 4 పెంచుతూ ఆదేశాలు ఇచ్చింది. పెంచిన ధరలు మే 3 ఆదివారం నుంచి అమల్లోకి రానున్నాయి. దాంతో రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు ఇది పెద్ద షాక్ అని చెప్పొచ్చు.ఒడిశా రాష్ట్ర సహకార పాలు ఉత్పత్తిదారుల సమాఖ్య పాల ధరలను పెంచింది. లీటర్ కు రూ. 4 చొప్పున పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. పెరిగిన పాల ధరలు మే 3 ఆదివారం నుంచి అమల్లోకి వచ్చాయి. పెరిగిన పాల ధరల ప్రకారం వివిధ పాల ప్యాకెట్ల ధరలు చూస్తే.. టోన్ మిల్క్ ధర లీటరు ప్రస్తుతం రూ. 50 ఉండగా అది కాస్తా రూ. 54 కు చేరింది. ఇక ప్రీమియం మిల్క్ ధర లీటర్ రూ. 54 నుంచి రూ. 58 కు చేరింది. అలాగే గోల్డ్ ప్రీమియం పాల ధర లీటర్ రూ. 56 నుంచి రూ. 60 కు పెరిగింది. చివరగా గోల్డ్ ప్రీమియం ప్లస్ పాల ప్యాకెట్ ధర లీటర్ రూ. 60 నుంచి రూ. 64 కు చేరింది.రాష్ట్రంలో పాల సేకరణ, ప్రాసెసింగ్, రవాణా ఖర్చులు, ప్యాకేజింగ్ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో పాల ధరలను పెంచినట్లు ఒడిశా రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి గోకులానంద మల్లిక్ వివరణ ఇచ్చారు. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. పాల ధరల పెంపు కారణంగా రాష్ట్రంలోని దాదాపు 3 లక్షల మంది పాడి రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఇక రాష్ట్రంలో పాల సేకరణ ధర కూడా పెరిగింది. ఆవు పాలు లీటర్ కు రూ.1 పెంచడం కారణంగా రైతులకు చెల్లించే ధర రూ. 40 కు చేరుకుంది. అలాగే గేదె పాల సేకరణ ధర కూడా లీటర్ కు రూ. 1.60 కు పెంచారు. ఇక పెరిగిన ధరలపై ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు

# తెలంగాణలో మండుతున్న ఎండలు..

## ఫస్ట్ టైం అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్.!




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, మెయిన్ డెస్క్:** తెలంగాణలో ఎండలు దంచికొడుతున్నాయి. ఎండలు, వడగాల్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 8 గంటలనుంచే సూర్యుడి ప్రతాపం కొనసాగుతుండటంతో జనం బయటకు రావాలంటే భయపడుతున్నారు. ఆదివారం (మే 3) అన్ని జిల్లాలో 40 నుంచి 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. వరంగల్, భూపాలపల్లిలో46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయింది. దీంతో ఫస్ట్ టైం రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లు చెబుతున్నారు. ఆరెంజ్ అంటే 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదు అవుతుంది. రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. రాబోయే రెండు రోజుల్లో ఎండలు తగ్గుముఖం పడతాయని అధికారులు చెబుతున్నప్పటికీ డిఫరెంట్ వెదర్ కనిపిస్తోంది. మరోవైపు వర్షాలు కూడా పడే ఛాన్స్ ఉందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి ఖమ్మం, మహబూబ్ నగర్ జిల్లాలో వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. మే 5, 6 తేదీల్లో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో తేలికపాటినుంచి మోస్తరు వర్షాలు పడే ఛాన్స్ ఉందని తెలిపింది. వర్షాలతో పాటు ఈదురుగాలులు, వేడిగాలులు కూడా వీస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

# నీటి గుంటల్లో నిశ్శబ్ద హంతకి.. కేరళను వణికిస్తున్న 'నెగ్లేరియా ఫౌలెరీ'

**కేరళలో బ్రెయిన్ ఈటింగ్ అమీబా కల్లోలం!**

**నాలుగు నెలల్లోనే 17 మంది మృతి చెందడంతో ప్రభుత్వం హై అలర్ట్**

**ముక్కు ద్వారా ప్రవేశించి మెదడును తినేసే ఈ ప్రాణాంతక అమీబా పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, సెంట్రల్ డెస్క్:** కేరళలో ప్రాణాంతకమైన 'బ్రెయిన్ ఈటింగ్ అమీబా' (నెగ్లేరియా ఫౌలెరీ) మరోసారి పంజా విసురుతోంది. గతంలో పదుల సంఖ్యలో ప్రజల ప్రాణాలను తీసిన ఈ హంతకీ.. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ మధ్య కాలంలో మరోసారి పంజా విసిరింది. గడిచిన 120 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 96 కేసులు నమోదు కాగా, ఈ వ్యాధి బారిన పడి 17 మంది ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. సాధారణంగా సరస్సులు, నదులు వంటి స్వచ్ఛమైన నీటి వనరులలో నివసించే ఈ అమీబా, ప్రజలు ఆ నీటిలో మునిగినప్పుడు ముక్కు ద్వారా శరీరంలోకి ప్రవేశిస్తుంది. అక్కడి నుంచి నేరుగా మెదడుపై ప్రభావం చూపి ప్రాణాలను హరిస్తుంది.ఈ వ్యాధి సోకిన వారిలో తీవ్రమైన జ్వరం, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. లక్షణాలు కనిపించిన వెంటనే సరైన చికిత్స తీసుకోకపోతే మరణం సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పెరుగుతున్న కేసుల దృష్ట్యా కేరళ ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రత్యేక డ్రైవ్‌ల ద్వారా బాధితులను త్వరగా గుర్తించి, వారికి తక్షణ చికిత్స అందించేందుకు చర్యలు చేపడుతోంది.

# చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో మునిగి కూలీ మృతి.!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, జహీరాబాద్:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగం మండలం జిరపల్లి గ్రామానికి చెందిన పిచ్చగుంట్ల సంగప్ప (52) అనే కూలీ చేపలు పట్టేందుకు వెళ్లి చెరువులో మునిగి మృతి చెందిన విషాద ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామ శివారులోని చెరువులో చేపలు పట్టే సమయంలో వల కాలికి చిక్కుకోవడంతో నీటిలో నుంచి బయటపడలేక ఊపిరాడక మృతి చెందినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న మృతుడి కుమారుడు పిచ్చగుంట్ల పాపయ్య ఝరాసంగం పోలీసులకు సమాచారం అందించగా, వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సహాయంతో చెరువులో నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో జిరపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి

# కౌన్సిలర్లకు హృదయపూర్వక కృతజ్ఞతలు: బాబా

**ఇస్నాపూర్ మున్సిపాలిటీ కో-ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన మొహమ్మద్ నిజాముద్దీన్ బాబా**

**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03:** బిఆర్ఎస్ పార్టీ, ఎమ్మెల్యే గుడెం మహిపాల్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్‌కు ప్రత్యేక ధన్యవాదాలు.. ప్రజల సేవలో నిబద్ధత!తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ మౌలిక సదుపాయాల మెరుగుదల.. యువత ఉపాధి, మహిళల సాధికారతకు ప్రాధాన్యత! ఇస్నాపూర్ మున్సిపాలిటీ కో-ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన మొహమ్మద్ నిజాముద్దీన్ బాబా.. కౌన్సిలర్లకు హృదయపూర్వక కృతజ్ఞతలు! ఇస్నాపూర్ మున్సిపాలిటీ కో-ఆప్షన్ సభ్యునిగా తనను ఎన్నుకున్నందుకు కౌన్సిలర్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసిన మొహమ్మద్ నిజాముద్దీన్ బాబా తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన బీ ఆర్ఎస్ పార్టీకి, ఎంఎల్ఏ గుడెం మహిపాల్ రెడ్డి కి, మాజీ జెడ్పిటిసి గడీల శ్రీకాంత్ గౌడ్ కి, చైర్ పర్సన్ సుమలత శ్రీకాంత్ కి, నాయకులకు ప్రతి ఒక్కరికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ప్రజల సేవలో నిబద్ధత.. మున్సిపాలిటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి!ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నాపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ప్రజల సేవలో నిబద్ధతతో పనిచేస్తానని, ఇస్నాపూర్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, ప్రజల సమస్యలను సమీపంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని" అని పేర్కొన్నారు. తాగునీరు, శుభ్రత, రోడ్లు, డ్రైనేజీ మౌలిక సదుపాయాల మెరుగుదల.. యువత ఉపాధి, మహిళల సాధికారతకు ప్రాధాన్యత!పట్టణంలో తాగునీరు, శుభ్రత, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. అలాగే యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళల సాధికారత కోసం కార్యక్రమాలు చేపట్టడం తన ముఖ్య లక్ష్యాలని అన్నారు. పారదర్శక సేవలకు కట్టుబడి.. ప్రజల మద్దతు ప్రేరణ! మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా సేవలు అందించడానికి కట్టుబడి ఉంటానని, ప్రతి ఒక్కరూ తనకు అందిస్తున్న ఆశీర్వాదాలు, మద్దతు తనకు ప్రేరణగా ఉంటాయని తెలిపారు.



# రెచ్చగొట్టి రాజకీయాలు చేయాలన్నదే హరీష్ రావు ఆలోచన

**హరీష్ రావు దొంగ ధర్నాలను రైతులు నమ్మరు**

**ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** సిద్దిపేట, కరీంనగర్ రాజీవ్ రహదారి మల్లారం వద్ద హరీష్ రావు ధాన్యం కొనుగోలు చేయాలనీ ధర్నా చేయడం పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈసందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.... రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం రైతన్నలకు పెద్ద పీఠ వేస్తోంది. రాష్ట్రంలో 8 వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఆరడుగుల హరీష్ రావుకు మెదడు మోకాలులోకి వచ్చింది. రెచ్చగొట్టి రాజకీయాలు చేయాలన్నదే హరీష్ రావు ఆలోచన. హరీష్ రావు రైతుల పేరుతో రెచ్చగొట్టి ధర్నాలు చేస్తున్నాడు. అధికారం కోల్పోయిన అక్కసుతో రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు నెలల పాటు ధాన్యం కొనుగోలు చేయకపోతే మొలకెత్తిన విషయాన్ని మరిచిపోయావా హరీష్ రావు దొంగ ధర్నాలను రైతులు నమ్మరు. ఈ రైతులే గోరి కట్టి మమ్మల్ని ఇంట్లో కూర్చొబెట్టారు. కేసీఆర్ సుద్దపూసలా ఫామ్ హౌస్ లో కూర్చుని రైతులను రెచ్చగొడుతున్నాడు. మేం 2 లక్షల రుణమాఫీ చేశాం, రైతు భరోసా ఇచ్చాం, సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నాం. ఇప్పటి వరకు మూడు వేల కోట్ల రూపాయలను రైతులకు బోనస్ గా ఇచ్చాం. రైతు సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక రెచ్చగొట్టి రాజకీయాలు చేస్తున్నారు. మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నారు. ప్రతి గింజను మా ప్రభుత్వం కొనుగోలు చేస్తాం. హరీష్ రావుకు సిగ్గు శరం ఉంటే దొంగ ధర్నాలు ఆపాలి అని అన్నారు.

# యాదగిరిగుట్ట దేవస్థానంలో వర్తక సంఘనికి ఎండోమెంట్ చట్టాలు వర్తించవా ..?

**దేవస్థానం అధికారులకు పట్టింపు లేదా...?**

**యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షులు కర్రే ప్రవీణ్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదగిరిగుట్ట పట్టణంలో పట్టణ బిజెపి కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు కర్రే ప్రవీణ్ మాట్లాడుతూ.... ఆదివారం ఉదయం వర్తక సంఘం వారు మీడియా సమావేశం నిర్వించడం జరిగింది. అయితే ఆ యొక్క సమావేశం నిర్వహించటువంటి వ్యక్తుల్లో ఎవరు పేదవారు ఉన్నారని మేము అడుగుతున్నాం 60 ఏళ్ల నుంచి మేము దీని మీద బతుకుతున్నాం అని చెప్తున్నారు మరి 60 ఏళ్ల నుంచి వీళ్ళని ఎందుకు వీటిని రద్దు చేసి టెండర్లు వేయలేదు ఎన్నేళ్లు షాపులో కొనసాగిస్తారు ఎండోమెంట్ చట్టాలు వీళ్ళకి వర్తించవా ..? ఆ 112 మంది ఉంటే కేవలం 10 , 15 మంది మాత్రమే ఈ మీడియా సమావేశం ఎందుకు నిర్వహించారు వాళ్ళ పేరు చెప్పి మీరు పబ్బం గడుపుతున్నారు. ఒక్కొక్క షాపును అమ్మడం కొనడం సబ్ లీజ్ ఇవ్వడం ఇవన్నీ జరుగుతున్నా కూడా దేవస్థానం అధికారులకు పట్టింపు లేదా అని చెప్పి అడుగుతున్న ఒక్కొక్కరికి ఏడాదికి లక్షల్లో ఐటీ కడుతున్న కూడా మేము పేదవారి మని చెప్పుకోవడం నిజంగా సిగ్గుచేటు నరసింహస్వామి అందరికీ దేవుడు రాష్ట్రంలోని అటు దేశంలోని వివిధ ప్రాంతాల భక్తులు వస్తేనే మనం ఇక్కడ వ్యాపారాలు చేసుకుంటున్నం కాబట్టి ఆ భక్తులకు కనీస అవసరాలు అందించే బాధ్యత మనందరి పైన ఉంది కొబ్బరికాయలు వంద రూపాయలు అమ్ముతారు నీళ్ల బాటల్ 40 అమ్ముతారు లుంగీ 300 రూపాయలు అమ్ముతారు భక్తులను దోచుకొని అధికారులు అండదండలతోటి దోపిడీ చేస్తున్నారు. ఏ ప్రభుత్వం వస్తే వాళ్లకు వత్తాసు పలుకుతూ రేన్యువల్ చేసుకుంటున్నారు ఎంతో మంది నిరుద్యోగులు తక్కువ జీతంతో దూర ప్రాంతాల వెళ్లి పనిచేస్తున్నారు. అలాంటిది వీళ్ళు మాత్రం దర్జాగా 60 ఏళ్ల నుంచి కొండపైన తిష్ట వేసి కూర్చున్నారు దేవాలయ అభివృద్ధిలో భాగంగా ఎంతోమంది భూములు, ప్లాట్లను ఇండ్లను కోల్పోయారు ఇండ్లను కోల్పోయారు అలాంటి వారికి పూర్తి నష్టపరిహారం కూడా ఇప్పటివరకు అందలేదు కొండ కింద కొన్ని వందల కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ కట్టిన కూడా దాన్ని నిరుపయోగంగా చేసి ఈరోజు వీళ్లు కొండపైన పైన షాపులు నిర్వహిస్తామన్నారు పేరుకేమో 10 షాపులు అని చెప్తుర్రు కానీ అక్కడ మాత్రం సుమారు 20 షాపులు నిర్వహిస్తున్నారు. స్థానిక కోట



కింద మాకు 70% షాపులు కేటాయించాలని అంటున్నాం మేము ప్రభుత్వానికి ఒకటే డిమాండ్ చేస్తా ఉన్నాం. మీరు గనక ఈ యొక్క షాప్లను టెండర్ వేయకపోతే జూన్ ఒకటో తారీఖున ప్రతి ఒక్క నిరుద్యోగులు కొండపైకి వెళ్లి కొబ్బరికాయలు, పూలు పండ్లు బట్టలు అన్ని స్వేచ్ఛగా అమ్ముకుంటామని చెప్పేసి మేము డిమాండ్ చేస్తా ఉన్నాం. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్, మండల మాజీ అధ్యక్షులు గుంటిపల్లి సత్యం, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆకుల చంద్రమౌళి, పట్టణ కార్యదర్శులు కర్ణ, సత్యనారాయణ, కోశాధికారి వీరేష్, సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి , మిర్యాల కృష్ణ, ఆకుల దేవేందర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై దాడి యత్నం హేయమైన చర్య

హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్ తీవ్ర ఖండన ఆలేరులో జరిగిన 'ప్రజా పాలన' కార్యక్రమంలో బీసీల పక్షాన నిలబడి, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై కాంగ్రెస్ కార్యకర్తలు భౌతిక దాడికి ప్రయత్నించడాన్ని ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్ తీవ్రంగా ఖండిస్తోంది. ?ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలని చూడటం నియంతృత్వ పోకడలకు నిదర్శనం. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఒక ప్రజాప్రతినిధి, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యాన్ని ఎండగడితే, సహేతుకమైన సమాధానం చెప్పాల్సింది పోయి.. దాడులకు దిగడం రాజకీయ దిగజారుడుతనానికి పరాకాష్ట. ?ఈ సందర్భంగా ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్ కింది అంశాలను డిమాండ్ చేస్తోంది,

**ప్రజాస్వామ్య హక్కుల రక్షణ :** సొంత పార్టీ ప్రభుత్వమే అయినా, ప్రజా సమస్యలపై విమర్శలు చేసే హక్కు ప్రజాప్రతినిధులకు ఉంటుంది. మల్లన్న లేవనెత్తిన బీసీల అన్యాయంపై చర్చ జరపాల్సింది పోయి, భౌతిక దాడులతో భయపెట్టాలని చూడటం సరైనది కాదు.

**కుట్ర కోణంపై విచారణ:** స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రోద్బలంతోనే ఈ దాడి జరిగిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ప్రభుత్వం దీనిపై నిష్పక్షపాత విచారణ జరిపించాలి.

**బీసీ నాయకత్వంపై అణచివేత :** బీసీల గొంతుకగా నిలుస్తున్న నాయకులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా బీసీ ఉద్యమాలను బలహీనపరచలేరు. అణగారిన వర్గాల అభివృద్ధి కోసం పోరాడే వారిని గౌరవించాల్సింది పోయి, ఇలాంటి దాడులకు పాల్పడటం రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితికి అద్దం పడుతోంది. తీన్మార్ మల్లన్న కి ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్ పూర్తి మద్దతు ప్రకటిస్తోంది. బీసీల ఆత్మగౌరవం కోసం, హక్కుల కోసం పోరాడే ఏ నాయకుడికైనా అన్యాయం జరిగితే, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ మేధావులు, ఉద్యమకారులు ఏకమై తగిన బుద్ధి చెబుతారని హెచ్చరిస్తున్నాము. ప్రభుత్వాలు మారినా, పార్టీలు మారినా బీసీల పట్ల వివక్ష కొనసాగడం దురదృష్టకరం. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము.

డాక్టర్ పర్వతం వెంకటేశ్వర్
ప్రెసిడెంట్ ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్.



డాక్టర్ పర్వతం వెంకటేశ్వర్
(ప్రెసిడెంట్ ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరమ్)

# ఫాల్తా నియోజకవర్గం మొత్తం రీపోలింగ్...

## మొత్తం 285 బూత్లలో ఈ నెల 21న పోలింగ్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) శనివారం ఒక అరుదైన, సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని ఫాల్తా అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉన్న మొత్తం 285 పోలింగ్ కేంద్రాల్లో తిరిగి 'కొత్తగా' ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. ప్రజాస్వామ్య ప్రక్రియకు తీవ్ర విఘాతం కలిగిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈసీ పేర్కొంది. సాధారణంగా హింస జరిగిన కొన్ని కేంద్రాల్లోనే రీపోలింగ్ నిర్వహిస్తుంటారు.కానీ, ఒక నియోజకవర్గం మొత్తం మళ్లీ ఎన్నిక జరపడం చాలా అరుదు. ఫాల్తాలో మే 21వ తేదీన పోలింగ్ జరగనుంది. దీనికి సంబంధించిన ఓట్ల లెక్కింపును మే 24న చేపడతామని ఎన్నికల సంఘం అధికార ప్రతినిధి వెల్లడించారు. ఏప్రిల్ 23, 29న రెండు దశల్లో జరిగిన ఎన్నికల సమయంలో ఫాల్తాలో భారీగా అక్రమాలు జరిగినట్లు నివేదికలు అందాయి. ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడిచేలా అక్కడ పరిస్థితులు ఉండటంతో ఈసీ ఈ కఠిన నిర్ణయం తీసుకుంది.




**మే 4 న మిగతా ఫలితాలు:**
రాష్ట్రంలోని మిగిలిన అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు షెడ్యూల్ ప్రకారం మే 4వ తేదీనే జరగనుంది. అయితే, ఫాల్తా నియోజకవర్గ ఫలితం మాత్రం మే 24న వెలువడనుంది. ఎన్నికల సంఘం తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది.

# కేసీఆర్ శకం ముగిసింది..

## ఆయన దేశంలోనే అత్యంత అవినీతిపరుడు : ఎంపీ అర్వింద్


**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, మెయిన్ డెస్క్:** నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ మరోసారి కేసీఆర్ పై నిప్పులు చెరిగారు. అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ లక్ష్యంగా విమర్శనాస్త్రాలు సంధించారు. కేసీఆర్‌కు మతిస్థిమితం తప్పింది.. ఆయన శకం ముగిసిందంటూ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలోనే కేసీఆర్ అత్యంత అవినీతి పరుడని ఆరోపించారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ, ఔటర్ రింగ్ రోడ్డులోనూ అవినీతికి పాల్పడ్డారని అన్నారు. డ్రగ్స్ ను రాష్ట్రానికి పరిచయం చేసిందే కేసీఆర్ అని వ్యాఖ్యానించారు. జీవన్ రెడ్డిని పార్టీలో ఎందుకు చేర్చుకున్నారో కనీసం కేసీఆర్‌కే తెలియదని, దీనివల్ల జగిత్యాల ప్రజలు అయోమయానికి గురవుతున్నారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మత్తుకు బానిసలుగా మార్చిందని మండిపడ్డారు.సీఎం రేవంత్ రెడ్డికి పాలనపై కనీస అవగాహన లేదని, పరిపాలనలో ఆయన పూర్తిగా ఫెయిల్ అయ్యారని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను రేవంత్ సర్కార్ గాలికొదిలేసిందని, ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ధ్వజమెత్తారు. జిల్లాకు చెందిన ప్రభుత్వ సలహాదారులు ఏం చేస్తున్నారని ఆయన నిలదీశారు.రాష్ట్రానికి ప్రధాని మోదీ రాకను స్వాగతిస్తూ.. సుమారు 7,800 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు మోదీ శ్రీకారం చుట్టబోతున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉచిత రేషన్ ఇస్తున్నది కేంద్రమేనని, మహిళా రిజర్వేషన్లను కాంగ్రెస్ అడ్డుకుని మహిళా లోకాన్ని మోసం చేసిందని దుయ్యబట్టారు. పసుపు రైతులకు ఈరోజు వస్తున్న అధిక ధరలకు ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయాలే కారణమని స్పష్టం చేశారు.వచ్చే ఎన్నికల్లో అటు బిఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ పార్టీలు కొట్టుకుపోవడం ఖాయమని.. బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరని ఎంపీ అర్వింద్ ధీమా వ్యక్తం చేశారు.




# అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన రత్న కుమార్

## భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు రత్న కుమార్





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కొత్తగూడెం నందు జిల్లా ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ ట్రస్ట్ రిజిస్ట్రేషన్ నెంబర్ బి కే ఐ వి 11/2025 ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాల పైన చర్చించి తీర్మానం చేయడమైనది. ఈ సమావేశ ముఖ్య ఉద్దేశం జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ల సంక్షేమం, మరియు ఇతర సమస్యలపై కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రత్నకుమార్ మాట్లాడుతూ ప్రతి ఏటా మే 3 వ తేదీన "అంతర్జాతీయ పత్రిక స్వేచ్ఛ దినోత్సవాన్ని" జరుపుకోవాలని ఐక్యరాజ్య సమితి పిలుపునిచ్చింది. 1991 లో యునెస్కో సర్వసభ్య సమావేశం చేసిన తీర్మానం మేరకు ఈ దినోత్సవాన్ని మే 3 న ప్రతి ఏటా నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 1993 లో తీర్మానం చేసింది. ప్రపంచ వ్యాప్తంగా మే 3 న పత్రికా స్వేచ్ఛ దినోత్సవం గా నిర్వహించాలని పిలుపు ఇచ్చింది. పత్రికా స్వేచ్ఛకు, భావ ప్రకటనా స్వేచ్ఛ కు నేడు ఎదురవుతున్న సవాళ్లు, ప్రమాదాల గురించి పౌర సమాజానికి, ప్రభుత్వాలకు గుర్తు చేయడం, స్వేచ్ఛా పరిరక్షణకు పోరాడటం, మీడియా సంస్థల పై, సిబ్బంది పై పెరిగి పోతున్న నిర్బంధాలు, దాడులు, హత్యలు, గురించి సమాజం దృష్టిలో పెట్టడం, జర్నలిస్టుల భద్రత పై ప్రత్యేక చట్టం కోసం ఒత్తిడి తేవడం, వృత్తిలో ఆదర్శ ప్రాయ మైన కృషి చేసిన మహనీయులను గౌరవించుకోవడం, విధి నిర్వహణ లో అసువులు బాసిన పాత్రికేయులను స్మరించుకోవడం వంటివి ఈనాటి దినోత్సవం లోని ముఖ్య అంశాలు. వివిధ దేశాలలో పత్రికా స్వేచ్ఛ స్థితి గతుల గురించి ఒక ఇండెక్స్ ను కూడా విడుదల చేస్తారు. మే 3 కోసం ప్రతి ఏటా యునెస్కో ఒక థీమ్ ను ప్రకటిస్తుంది. ఈ దినోత్సవానికి సంబంధించిన అంతర్జాతీయ స్థాయి కార్య క్రమం మే1 నుండి 3 వరకూ ఇథియోపియా రాజధాని అడిస్ అబాబా లో జరుగుతోంది. జర్నలిజం లో విశేష కృషి చేసిన వ్యక్తికి గాని, సంస్థకు గానీ అవార్డ్ ను యునెస్కో అంద చేస్తుంది. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ను స్థాపించిన నవంబర్ 16 ను జాతీయ పత్రికా దినోత్సవంగా మన దేశం లో ప్రెస్ కౌన్సిల్ పిలుపు మేరకు నిర్వహిస్తున్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో పాదమైన పాత్రికేయం స్వేచ్ఛ గా సమాజ శ్రేయస్సు పరిరక్షణలో గౌరవంగా ముందుకు సాగాలని కోరుకుంటూ మిత్రులు అందరికీ "అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛ"దినోత్సవ శుభాకాంక్షలు సందర్భంగా పాత్రికేయ మిత్రులకు శుభాకాంక్షలు తెలిపిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రెస్ క్లబ్ వెల్ఫేర్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు రత్నకుమార్, జిల్లా కార్యదర్శి గోనెల సతీష్ కుమార్, ట్రెజరర్ గోపి, జిల్లా కమిటీ సభ్యులు బరిగెల భూపేష్, సతీష్, నాగయ్య, పోలయ్య కౌశిక్ సందీప్ రాజేశ్వరి రంజిత్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మేడే సందర్భంగా కార్మిక నాయకులను సన్మానించిన రివర్ సైడ్ రోటరీ క్లబ్ నాయకులు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
"మే డే"... ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం రివర్ సైడ్ నాయకులు ఐటిసి పిఎస్పీడీ కర్మాగారంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు నాయకత్వం వహిస్తున్న కార్మిక నాయకులను ఘనంగా సన్మానించారు.ఎవరి సంపాదన, ఎవరి కుటుంబం వారిది అంటూ వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాలతో నిండినటువంటి ప్రస్తుత సమాజంలో, తోటి కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు వారి హక్కులను కాపాడేందుకు తమ సమయాన్ని వెచ్చించి కా కాంట్రాక్టు కార్మికుల తరపున పోరాడుతున్న కాంట్రాక్టు కార్మిక నాయకులైన జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ పాటీ సోమిరెడ్డిని, జేఏసీ జాయింట్ కన్వీనర్లు అయిన సానికొమ్ము రామచంద్రారెడ్డి, సర్వేశ్వరరావు, బల్లెం నాగయ్య, ఎస్కే పాషా తదితరులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల మాజీ రోటరీ ఇంటర్నేషనల్ గవర్నర్ మరియు ప్రస్తుత రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం రివర్ సైడ్ అధ్యక్షులు డాక్టరేట్ భూశిరెడ్డి శంకర్ రెడ్డి ప్రసంగిస్తూ, నాయకత్వం అనేది కత్తి మీద సాము వంటిదని డాక్టరేట్ డా బూసిరెడ్డి శంకర్ రెడ్డి పేర్కొన్నారు. సందర్భాన్ని బట్టి స్పందించాలని, తాము పనిచేసే కంపెనీ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కార్మికుల ఇబ్బందులను హక్కులను కంపెనీ దృష్టికి తీసుకువెళ్లి, యాజమాన్యాన్ని ఒప్పించి తమను నమ్మిన కార్మికులను మెప్పించే విధంగా సామరస్య వివాద రహిత ఒప్పందాలను చేసుకోవాలని ఈ సందర్భంగా డాక్టరేట్ డా.బూసిరెడ్డి శంకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా నాయకులు డాక్టర్ మడిపెద్ద రమేష్ , రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం రివర్ సైడ్ కాబోయే అధ్యక్షులు రొటేరియన్ ధనకొండ రాఘవయ్య భవిష్యత్తు రోటరీ క్లబ్ ఆఫ్ రివర్ సైడ్ అధ్యక్షులు బాచినేని రామకృష్ణ రోటరీ సభ్యులు రవికుమార్ తదితరులతో పాటు మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి అనేకమంది కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.




# డోర్నకల్‌లో పరామర్శలు : మాలోత్ నెహ్రూ నాయక్



**హైదరాబాద్ పల్స్, మే 03, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
డోర్నకల్ మున్సిపల్ కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుమీర్ జైన్ సతీమణి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు మాలోత్ నెహ్రూ నాయక్ ఆదివారం వారి నివాసాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ సుశీల్ కుమార్ జైన్‌ను కూడా పరామర్శించారు. కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడిన ఆయన, అనారోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం చికిత్స కొనసాగుతోందని తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నాయకుల పరామర్శతో బాధిత కుటుంబానికి కొంత ఊరట లభించినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా పాల్గొని సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొండేటి రాజకుమారి హరినాథ్, రెండో వార్డు కౌన్సిలర్ ప్రేమిల, తారాచంద్, కొత్త యాకయ్య ప్రవీణ్, అశ్వక్, దాసరి నాని యాదవ్, వీరాస్వామి, ప్రవీణ్, జోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# స్వర్గీయ జహంగీర్ సంస్మరణ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో సామాజిక ఉద్యోమ కళాకారుడు స్వర్గీయ జహంగీర్ సంస్మరణ సభ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జహంగీర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఆ తర్వాత తోటి కళాకారులు రూపొందించిన పాట సీడీ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ, జహంగీర్ సామాజిక చైతన్యాన్ని కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లిన గొప్ప కళాకారుడని కొనియాడారు. సమాజంలోని అన్యాయాలు, అసమానతలపై తన కళతో పోరాడిన వ్యక్తిగా ఆయనను గుర్తు చేసుకున్నారు. జహంగీర్ సేవలు, ఆలోచనలు ఎల్లప్పుడూ ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అలాగే యువ కళాకారులు జహంగీర్ మార్గాన్ని అనుసరించి సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కళాకారులు, అభిమానులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డాక్టర్ చుక్క సత్తయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
జనగామ జిల్లా కేంద్రంలో ఒగ్గుకళ పితామహుడు దివంగత జానపద కళాకారుడు డాక్టర్ చుక్క సత్తయ్య విగ్రహాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిని ఒగ్గు కథను విశ్వవ్యాప్తం చేసిన ఆయన కృషికి ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం చాలా సంతోషమని, తెలంగాణ జానపద కళాకారూపాలను ఒగ్గు కథమార్చి,12వందలకు పైగా ప్రదర్శనలు ఇచ్చిన గొప్ప కళాకారుడు చుక్క సత్తయ్య విగ్రహాన్ని ఆవిష్కరించడం చాలా అదృష్టంగా భావిస్తున్నన్నారు.

# మంటగలిసిన మానవత్వం.. తోపుడు బండిపై మృతదేహం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03 శంకరపట్నం :**
మన దేశ ప్రగతి చూస్తే చాలా సంతోషం అనిపిస్తుంటుంది. కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం తాజాగా శంకరపట్నం మండలం కేశవపట్నంలో జరిగిన ఓ ఘటన మానవత్వం మంటగలిసినట్లు నిరూపిస్తుంది. కేశవపట్నం ఎల్కపల్లి యాకూబ్ ఆదివారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందాడు. జాతీయ రహదారి పక్కన దాదాపు పది సంవత్సరాలుగా అరటిపళ్ళ అమ్మతో జీవనోపాధి పొందుతున్నారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు కుమారుడి తండ్రి వీరయ్య వద్ద డబ్బులు లేవు. అంబులెన్సు అందుబాటులో లేదు. కుమారుడి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు తోపుడు బండిపై రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ ఇంటికి తీసుకెళ్లారు. అయితే తోపుడు బండిపై మృదేహాన్ని తీసుకెళ్తున్నడ్పు పలువురుని కంటతడి పెట్టించింది. కొంత మంది దీన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# మంటగలిసిన మానవత్వం.. తోపుడు బండిపై మృతదేహం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03 శంకరపట్నం :**
మన దేశ ప్రగతి చూస్తే చాలా సంతోషం అనిపిస్తుంటుంది. కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం తాజాగా శంకరపట్నం మండలం కేశవపట్నంలో జరిగిన ఓ ఘటన మానవత్వం మంటగలిసినట్లు నిరూపిస్తుంది. కేశవపట్నం ఎల్కపల్లి యాకూబ్ ఆదివారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందాడు. జాతీయ రహదారి పక్కన దాదాపు పది సంవత్సరాలుగా అరటిపళ్ళ అమ్ముతూ జీవనోపాధి పొందుతున్నారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు కుమారుడి తండ్రి వీరయ్య వద్ద డబ్బులు లేవు. అంబులెన్సు అందుబాటులో లేదు. కుమారుడి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు తోపుడు బండిపై రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ ఇంటికి తీసుకెళ్లారు. అయితే తోపుడు బండిపై మృదేహాన్ని తీసుకెళ్తున్నడ్పు పలువురుని కంటతడి పెట్టించింది. కొంత మంది దీన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు

## పార్కులో ఆట వస్తువులను ఏర్పాటు చెసిన మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 34వ, వార్డు లో 10లక్షలతో ఓపెన్ జిమ్ కిసాన్ నగర్ లో గల ఛత్రపతి శివాజీ పార్క్ లో చిన్నారుల వినోదం కోసం నూతనంగా ఆట వస్తువులను ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం జరిగింది. స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ నిధులతో వీటిని సమకూర్చారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆట వస్తువులను ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ, "పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే మా లక్ష్యం. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మార్గదర్శకత్వంలో భువనగిరి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాము. విశాలమైన స్థలం ఉన్న పార్కులను గుర్తించి, అక్కడ పిల్లల కోసం మరిన్ని వసతులు కల్పిస్తాము. కిసాన్ నగర్ ప్రజలు మరియు పిల్లలు ఈ వసతులను సద్వినియోగం చేసుకోవాలని, పార్కు పరిశుభ్రతను కాపాడాలని" ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, 34వ వార్డు కౌన్సిలర్ సరగడ మంజుల అమర్, 32వ వార్డు కౌన్సిలర్ బర్రె సంఘవి కరుణాకర్, మున్సిపల్ డీఈ, ఇతర మున్సిపల్ అధికారులు మరియు వార్డు ప్రముఖులు పాల్గొన్నారు.

## వడగళ్ల వానతో రైతుల కష్టం నీటిలో...

# తడిసిన ధాన్యాన్ని షరతులు లేకుండా కొనాలి


**వెంకన్న కుటుంబానికి రూ.20 లక్షల సహాయం ఇవ్వాలి: మహమ్మద్ జానీమియా**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి :**
మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం కురిసిన వడగళ్ల వాన రైతుల జీవితాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. కొనుగోలు కేంద్రాలు, నిల్వ ఉంచిన వరి ధాన్యం పూర్తిగా తడిసి ముద్దవడంతో రైతులు ఆర్థికంగా కుంగిపోయారు. ఈ పరిస్థితిపై జిల్లా మైనార్టీ నాయకులు మహమ్మద్ జానీమియా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వంపై కఠినంగా స్పందించారు. నెలల తరబడి కష్టపడి పండించిన పంటను రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి రోజులు గడుపుతున్నారు. కానీ తేమశాతం, నాణ్యత వంటి నిబంధనల పేరుతో కొనుగోళ్లు ఆలస్యం చేయడం వల్లే ఈరోజు వడగళ్ల వానకు ధాన్యం నష్టపోయింది. ఇది కేవలం ప్రకృతి వైపరీత్యం కాదు, ప్రభుత్వ వైఫల్యం కూడా" అని ఆయన విమర్శించారు. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా మారిన వాతావరణంతో గాలిదుమారం, ఉరుములు, మెరుపులతో కూడిన వాన కురవగా, రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకునేందుకు ప్రాణాలకు తెగించి పరుగులు పెట్టిన దృశ్యాలు హృదయ విదారకంగా ఉన్నాయని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస రక్షణ సదుపాయాలు లేకపోవడం పరిస్థితిని మరింత దారుణంగా మార్చిందని అన్నారు. కురవి మండలం సుధానపల్లి గ్రామానికి చెందిన రైతు నీలం వెంకన్న పిడుగు పడి మృతి చెందిన ఘటనపై జానీమియా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ధాన్యాన్ని కాపాడే క్రమంలో ఒక రైతు ప్రాణం కోల్పోవడం అత్యంత దురదృష్టకరం. సకాలంలో ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు చేసి ఉంటే ఆయన ప్రాణం నిలిచేది. ఈ మరణం ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలైనదే" అని అన్నారు. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకుని తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కండిషన్స్ లేకుండా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులను నిబంధనల పేరుతో మరింత ఇబ్బందులకు గురిచేయకుండా మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. అదేవిధంగా, మృతి చెందిన వెంకన్న కుటుంబానికి తక్షణమే రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. వడగళ్ల వాన వల్ల నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందించాలని, జిల్లాలో ప్రత్యేక సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే రైతుల తరఫున పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టడం తప్ప మరో మార్గం ఉండదని హెచ్చరిస్తూ, రైతు సంక్షేమం మాటల్లో కాకుండా కార్యరూపంలో చూపాలని జానీమియా పేర్కొన్నారు.

# వడగళ్ల వాన విధ్వంసం... మహబూబాబాద్ జిల్లాలో రైతుల కష్టం నీటి పాలు

**ప్రభుత్వ నిర్లక్ష్యమే నష్టానికి కారణం: డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వివేక్ ఘాటు విమర్శలు**

**హైదరాబాద్ పల్స్, మే 03, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా మారిన వాతావరణం వడగళ్ల వానగా విరుచుకుపడి రైతుల జీవితాలను అస్తవ్యస్తం చేసింది. గాలిదుమారం, ఉరుములు, మెరుపులతో కూడిన ఈ ఆకస్మిక వర్షం కారణంగా కొనుగోలు కేంద్రాలు, పొలాల్లో ఎండబెట్టిన వరి ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది. నెలల తరబడి చెమటోడ్చి పండించిన పంట క్షణాల్లో నాశనం కావడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. కొందరు రైతులు కళ్లముందే పంట నీటిలో కలిసిపోతుండగా నిరాశతో విలవిలలాడారు. ప్రత్యేకంగా కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితి అత్యంత దారుణంగా మారింది. తగిన రక్షణ ఏర్పాట్లు లేకపోవడంతో పెద్దఎత్తున నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి బలి అయింది. షెడ్లు, తార్పులు, కవర్లు లేకపోవడం వల్ల వేలాది క్వింటాళ్ల ధాన్యం నాణ్యత కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. వర్షం ప్రారంభమైన వెంటనే రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకోవడానికి ప్రాణాలకు తెగించి పరుగులు తీసిన దృశ్యాలు హృదయ విదారకంగా మారాయి. ఈ పరిణామాలపై డీఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వివేక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం ప్రదర్శించిన నిర్లక్ష్యమే ఈ నష్టానికి ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. తేమశాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తూ, బస్తాల కొలతలు, నాణ్యత ప్రమాణాల పేరుతో కొనుగోళ్లను ఆలస్యం చేయడం వల్లే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిందని పేర్కొన్నారు. "రైతు చెమటతో పండించిన ప్రతి గింజను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ ప్రభుత్వం ఆ బాధ్యతను పూర్తిగా విస్మరించింది. వాతావరణ మార్పులు ముందుగానే తెలిసినా సరైన చర్యలు తీసుకోలేదు. కనీసం తాత్కాలిక రక్షణ ఏర్పాట్లు కూడా చేయకపోవడం బాధాకరం" అని ఆయన విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతుల శ్రమ కళ్లముందే నీటిలో కలిసిపోయిందని మండిపడ్డారు. కురవి మండలం సుధానపల్లి గ్రామంలో చోటుచేసుకున్న విషాద ఘటన జిల్లా మొత్తాన్ని కలచివేసింది. కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న నీలం వెంకన్నపై పిడుగు పడి మృతి చెందడం పట్ల డాక్టర్ వివేక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "సకాలంలో ధాన్యం కొనుగోలు జరిగి ఉంటే వెంకన్న ఆ సమయంలో అక్కడ ఉండాల్సిన అవసరం ఉండేది కాదు. ఆయన మృతి కేవలం ప్రకృతి విపత్తు కాదు, ప్రభుత్వ నిర్లక్ష్యానికి బలైన ప్రాణం" అని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జిల్లాలో రైతుల పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉంది. తడిసిన ధాన్యం నాణ్యత తగ్గిపోవడం వల్ల మార్కెట్‌లో తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అప్పుల భారంతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న రైతులు ఇప్పుడు మరింత మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. పంట నష్టంతో పాటు కుటుంబాల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో డాక్టర్ వివేక్ ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి తేమశాతం నిబంధనలు లేకుండా కొనుగోలు చేయాలని, నష్టపోయిన ప్రతి రైతుకు తక్షణ పరిహారం ప్రకటించాలని, మృతుడైన వెంకన్న కుటుంబానికి భారీ ఆర్థిక సాయం అందించాలని కోరారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు ఉద్ధృతం చేసి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు.



## తెలంగాణలో భారీ వర్షాలు..

# హెచ్చరించిన వాతావరణశాఖ..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, మెయిన్ డెస్క్:**
తెలంగాణలో ఎండలు మండుతున్నాయి. ఉదయం నుంచే భానుడు ప్రతాపం చూపిస్తుండడంతో బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఈ క్రమంలో వాతావరణశాఖ తీపికబురు చెప్పింది. వారం రోజులు పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రాగల రెండురోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతల్లో ఎలాంటి మార్పు ఉండదని, ఆ తర్వాత రెండు నుంచి మూడు డిగ్రీలు క్రమంగా తగ్గుతాయని పేర్కొంది. ఆదివారం కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలున్నాయని తెలిపింది.సోమవారం గంటకు 30 నుంచి 40 మీటర్ల వేగంతో గాలులు వీస్తూ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, నాగర్ కర్నూల్ జిల్లాలో వర్షాలు పడుతాయని అంచనా వేసింది. మంగళవారం భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండలో భారీ వర్షాలు కురుస్తాయని, ఉరుములు, మెరుపులు, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. అలాగే, ఆసిఫాబాద్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, జనగాం, సిద్ది పేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి,




వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని తెలిపింది.అలాగే, బుధవారం పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. అలాగే, ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు పడే సూచనలున్నాయని పేర్కొంది. అలాగే, గురువారం నుంచి శనివారం వరకు పలుచోట్ల భారీ ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వానలు కొనసాగుతాయని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

# అవకాడోతో ఆరోగ్యం ప్రయోజనాలెన్నో..

**తెలిస్తే అస్సలు వదలరు**




ఇంటర్నెట్ డెస్క్: ఎండాకాలంలో మన శరీరం అధిక వేడికి గురవుతుంది. ఈ సమయంలో చర్మం, కళ్లు, జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుకోవడానికి పోషకాహారం తీసుకోవడం చాలా ముఖ్యం. అనేక రకాల పోషకాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు కలిగిన 'అవకాడో' పండును ఈ సీజన్‌లో తీసుకోవడం వల్ల అద్భుతమైన ప్రయోజనాలు చేకూరతాయి. రోజూ ఒక అవకాడో తినడం వల్ల కలిగే లాభాలు గురించి తెలుసుకుందాం..

**1. చర్మ సౌందర్యం, రక్షణ:**
ఎండల తీవ్రతకు చర్మం డీహైడ్రేషన్ బారినపడుతుంది. అవకాడోలో ఉండే విటమిన్ ఇ , ఆరోగ్యకరమైన మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు చర్మాన్ని లోపలి నుంచి హైడ్రేట్‌గా ఉంచుతాయి. ఇది సహజమైన మాయిశ్చరైజర్‌గా పనిచేస్తూ, ఎండ వల్ల కలిగే చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది.

**2. కంటి ఆరోగ్యం:**
అవకాడోలో లూటిన్, జియాక్సంతిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎండలోని హానికరమైన కాంతి నుంచి కళ్లను రక్షించడమే కాకుండా దృష్టి లోపాలు రాకుండా కాపాడతాయి.

**3. జీర్ణక్రియ మెరుగుపడుతుంది:**
వేసవిలో చాలామందికి జీర్ణ సంబంధిత సమస్యలు వస్తుంటాయి. అవకాడోలో ఫైబర్ (పీచు పదార్థం) ఎక్కువగా ఉంటుంది. ఇది మలబద్ధకాన్ని నివారించి, జీర్ణవ్యవస్థను క్రమబద్ధీకరించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

**4. గుండె ఆరోగ్యానికి మేలు:**
ఇందులో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది. అలాగే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడం ద్వారా గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఎండాకాలంలో గుండెపై పడే భారాన్ని తగ్గించడానికి ఇది ఒక మంచి ఎంపిక.

**5. బరువు నియంత్రణ:**
అవకాడో తినడం వల్ల కడుపు నిండుగా ఉన్న అనుభూతి కలుగుతుంది. దీనివల్ల అనవసరమైన స్నాక్స్ తినడం తగ్గుతుంది. ఇది బరువును నియంత్రణలో ఉంచుకోవడానికి దోహదపడుతుంది.

**6.ఎన్నో పోషకాలు:**
అవకాడో ఒక అద్భుతమైన పోషకాల నిధి. ఇందులో బి6, సి, ఇ, కె వంటివి పుష్కలంగా ఉంటాయి. ఈ శరీరంలో రోగనిరోధకశక్తిని మెరుగుపరుస్తాయి. వీటితో పాటు రిబోఫ్లోవిన్, నయాసిన్, ఫోలేట్, పేంటోథినిక్ యాసిడ్, మెగ్నీషియం, పోటాషియం, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ వంటివి లభిస్తాయి.

# రైతు ద్రోహి కుంభం అనిల్ కుమార్ రెడ్డికి రోజులు దగ్గరపడ్డాయి...

**బహిరంగ చర్చకు సిద్ధమా? బీజేపీ సవాల్...**
**యాదాద్రి భువనగిరి జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు ఫకీర్ రాజేందర్ రెడ్డి**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మే 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రైతుల సమస్యలను గాలికొదిలేసి, ప్రశ్నించే వారిపై భౌతిక దాడులకు దిగుతున్న భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తీరును భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండించింది. బీజేపీ భువనగిరి రూరల్ మండల అధ్యక్షులు చిలుక సురేష్ రెడ్డి, పోచంపల్లి మండలం టౌను మండల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు ఫకీర్ రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నిజమైన రైతు సేవ బీజేపీదే! బీజేపీ రాష్ట్ర నాయకులు ఎన్. రామచంద్ర రావు హన్మపురం వద్ద కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులను అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇది నిజమైన రైతు సేవే తప్ప రాజకీయం కాదని బీజేపీ స్పష్టం చేసింది. రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు కళ్లు మూసుకుని కూర్చున్న ఎమ్మెల్యే, సమస్యలను ఎత్తిచూపితే సహించలేకపోవడం ఆయన అసమర్థతకు నిదర్శనమని నాయకులు ధ్వజమెత్తారు. అనిల్ కుమార్ రెడ్డి వైఖరిపై ముఖ్య అతిథి ఫకీర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే నైతిక పతనం ప్రభుత్వ ఉన్నతాధికారి అయిన అదనపు కలెక్టర్ సమక్షంలోనే రాజకీయ దాడికి దిగడం అత్యంత హీనమైన చర్య. ఇది ప్రభుత్వ వ్యవస్థను అపహాస్యం చేయడమే. రైతు వ్యతిరేక మనస్తత్వం "ఔటర్ రింగ్ రోడ్డు దగ్గరే ఉండాలి" అని ఎమ్మెల్యే మాట్లాడటం ఆయన అహంకారానికి పరాకాష్ట. గిరిజన, మారుమూల ప్రాంతాల్లో రైతులు చనిపోతున్నా పట్టించుకోని ఎమ్మెల్యేకు, కేవలం లగ్జరీ రాజకీయాలే ముఖ్యమని తేలిపోయింది. మీరు రైతులను గాలికొదిలేశారు కాబట్టే, బీజేపీ నాయకులు రోడ్లపైకి వచ్చి అధికారులను నిలదీయాల్సి వస్తోంది. ఐకెపి సెంటర్ల ద్వారా ఇప్పటివరకు ఎన్ని టన్నుల వడ్లు కొనుగోలు చేశారు? రైతులకు జరిగిన అన్యాయం ఎంత? దీనిపై తక్షణమే ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి. బహిరంగ చర్చకు సిద్ధమా? ఎమ్మెల్యేకు నిజంగా ధైర్యం ఉంటే కలెక్టర్ కార్యాలయంలో కాకుండా, క్షేత్రస్థాయిలో సామాన్య కార్యకర్తలతో బహిరంగ చర్చకు రావాలి. రైతు వ్యతిరేక విధానాలను కొనసాగిస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, అనిల్ కుమార్ రెడ్డి రాజకీయ పతనం ప్రారంభమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కిసాన్ మోర్చా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు.

# ఉప్పు, చక్కెర ఎక్కువ వాడుతున్నారా? మీ ప్రాణాలు ప్రమాదంలో ఉన్నట్టే!




ఇంటర్నెట్ డెస్క్: నేటి ఆధునిక జీవనశైలిలో ప్రజలు ఉప్పు, చెక్కరలను అధికంగా వినియోగిస్తున్నారు. రెండూ ఆహార రుచిని పెంచడానికి ఉపయోగపడతాయి. అయితే, మోతాదులో తింటేనే ఆరోగ్యం అన్ని విధాలా బావుంటుంది. లేదంటే ఎన్నో అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. 'అతి సర్వత్ర వర్జయేత్' అన్నట్టు.. ఏదీ మితిమీరినా ప్రమాదమే. ఉప్పు, చక్కెరల వాడకాన్ని నియంత్రించి, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవడం ద్వారా నిండు నూరేళ్లు జీవించవచ్చు. 1. ఉప్పులో ఉండే సోడియం శరీరానికి అవసరమే అయినప్పటికీ, అది ఎక్కువైతే రక్తపోటు పెరుగుతుంది. శరీరంలో సోడియం పెరిగితే రక్తనాళాలపై ఒత్తిడి పెరిగి 'హై బిపి'కి దారితీస్తుంది. దీర్ఘకాలిక అధిక రక్తపోటు వల్ల గుండెపోటు, స్ట్రోక్ వచ్చే అవకాశం ఉంది. ఉప్పు ఎక్కువైతే మూత్రపిండాల వడపోత సామర్థ్యం తగ్గి, కిడ్నీ వ్యాధులు వస్తాయి.

2. చక్కెరను 'వైట్ పాయిజన్' అని పిలుస్తారు. చక్కెరలో క్యాలరీలు ఎక్కువ. ఇది శరీరంలో కొవ్వు పేరుకుపోయేలా చేసి బరువును పెంచుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం వల్ల ఇన్సులిన్ నిరోధకత ఏర్పడి 'టైప్-2 డయాబెటిస్'కు కారణమవుతుంది. అతిగా చక్కెర తీసుకోవడం వల్ల కాలేయంలో కొవ్వు చేరుతుంది.

3. మనం ఎక్కువ ఉప్పు తీసుకున్నప్పుడు, మన శరీరం ఆ అధిక సోడియంను మూత్రం ద్వారా బయటకు పంపే ప్రయత్నం చేస్తుంది. ఈ ప్రక్రియలో సోడియంతో పాటు కాల్షియం కూడా శరీరం నుంచి బయటకు పోతుంది. దీనివల్ల ఎముకలు సాంద్రత కోల్పోయి బలహీనపడతాయి. చిన్న దెబ్బలకే ఎముకలు విరిగే ప్రమాదం పెరుగుతుంది.

4. అతిగా చక్కెర తీసుకోవడం వల్ల చర్మం తన మెరుపును కోల్పోతుంది. రక్తంలోని చక్కెర, ప్రోటీన్లతో కలిసి హానికరమైన అణువులను ఉత్పత్తి చేస్తుంది. ఇది చర్మంలోని కొల్లాజెన్‌ను దెబ్బతీసి, చిన్న వయసులోనే ముడతలు వచ్చేలా చేస్తుంది. మొటిమలు, చర్మ సంబంధిత అలర్జీలు కూడా పెరగవచ్చు.

5. చక్కెర, ఉప్పు కేవలం శారీరక ఆరోగ్యాన్నే కాదు, మానసిక స్థితిని కూడా ప్రభావితం చేస్తాయి. చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలు తిన్నప్పుడు వెంటనే శక్తి వచ్చినట్లు అనిపిస్తుంది, కానీ కాసేపటికే నీరసం, చిరాకు ఆవహిస్తాయి. అధిక ఉప్పు వల్ల నిద్రలేమి, ఆందోళన వంటి సమస్యలు తలెత్తవచ్చు.

జాగ్రత్త పడటం ఎలా?
చిప్స్, ప్యాక్ చేసిన స్నాక్స్, సాఫ్ట్ డ్రింక్స్‌లో ఉప్పు, చక్కెరలు అత్యధికంగా ఉంటాయి. వాటిని వీలైనంత వరకు తగ్గించండి.
కూరల్లో ఉప్పుకు బదులు నిమ్మరసం లేదా ఇతర సహజ మసాలాలను వాడటానికి ప్రయత్నించండి.
ఏదైనా వస్తువు కొనే ముందు అందులో ఎంత సోడియం లేదా షుగర్ ఉందో గమనించండి.
నీరు ఎక్కువగా తాగండి.. ఇది శరీరంలోని అదనపు సోడియంను బయటకు పంపడానికి సహాయపడుతుంది.
సైంధవ లవణంలో కూడా సోడియం ఉంటుంది, కాబట్టి దాన్ని కూడా పరిమితంగానే వాడాలి.
బెల్లం పంచదార కంటే మేలైనదే కానీ, అది కూడా ఒక రకమైన చక్కరే. డయాబెటిస్ ఉన్నవారు లేదా బరువు తగ్గాలనుకునే వారు బెల్లాన్ని కూడా తక్కువగానే తీసుకోవాలి.

## వేసవి కదా అని కొబ్బరినీళ్లను అధికంగా తాగుతున్నారా..

# అయితే ఈ విషయాలను తప్పనిసరిగా తెలుసుకోవాల్సిందే..

వేసవి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో శరీరాన్ని చల్లగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరికీ అత్యంత అవసరం. ఈ నేపథ్యంలో కొబ్బరి నీళ్లు చాలా మందికి సహజ శీతల పానీయంగా మారుతుంది. అయితే ఇటీవలి కాలంలో ఇది నిజంగా అంత ఉపయోగకరమా? లేక సోషల్ మీడియా ప్రభావంతో అతిగా ప్రాచుర్యం పొందిందా? అనే చర్చ కూడా ఎక్కువగా జరుగుతోంది. దేశంలో చాలా ప్రాంతాల్లో కొబ్బరి నీటిని కేవలం వేసవిలోనే కాకుండా సంవత్సరమంతా తాగుతారు. వీటిలో ఉండే ఎలక్ట్రోలైట్స్ శరీరానికి అవసరమైన ద్రవ సమతౌల్యాన్ని అందించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా పొటాషియం ఎక్కువగా ఉండటం వల్ల ఇవి కండరాల నొప్పులను తగ్గించడంలో, డీహైడ్రేషన్‌ను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

ఆరోగ్యానికి మేలే అయినా..
ఒక గ్లాస్ కొబ్బరి నీటిలో ఒక మీడియం సైజు అరటిపండుతో సమానమైన లేదా అంతకంటే ఎక్కువ మొత్తంలో పొటాషియం ఉంటుంది. అదేవిధంగా కొబ్బరి నీటిలో మెగ్నీషియం, కాల్షియం వంటి ఖనిజాలు కూడా కొంతమేర లభిస్తాయి. ఇవి చెమట ద్వారా కోల్పోయే ఖనిజాలను భర్తీ చేయడంలో సహాయపడతాయి. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఇది తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉండటం. సోడాలు, ప్రాసెస్ చేసిన జ్యూస్‌లతో పోలిస్తే ఇందులో చక్కెర శాతం తక్కువగా ఉంటుంది (సుమారు 4-6 శాతం). అందువల్ల ఇది ఆరోగ్యకరమైన పానీయంగా పరిగణించబడుతుంది. అయితే తాజా కొబ్బరి నీరే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ప్యాకేజ్డ్ రూపంలో వచ్చే కొబ్బరి నీటిలో మైక్రోప్లాస్టిక్స్, ప్రిజర్వేటివ్స్, కృత్రిమ రుచులు కలిసే అవకాశం ఉండటం వల్ల దాని పోషక విలువలు తగ్గిపోతాయి. అంతేకాకుండా పరిశోధనలు చెబుతున్నట్లు, సాధారణంగా కూర్చునే జీవనశైలి ఉన్నవారికి ఇది సాధారణ నీటితో పోలిస్తే ప్రత్యేక ప్రయోజనం ఇవ్వదు.

సంప్రదాయ పానీయాలను మరువద్దు..
ఇక సంప్రదాయ పానీయాలు కూడా కొబ్బరి నీటికి సమానంగా లేదా మరింత ప్రయోజనకరంగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. చాస్ (మజ్జిగ) ప్రోబయోటిక్ గుణాలు కలిగి ఉండి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. సత్తు పానీయం శక్తిని నిలకడగా అందిస్తుంది. బేల్ శర్బత్ వంటి పానీయాలు వేడి వల్ల కలిగే జీర్ణ సమస్యలను తగ్గించడంలో ఉపయోగపడతాయి. ఇవి తక్కువ ఖర్చుతో లభించడమే కాకుండా ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. అయితే కొబ్బరి నీటిని అధికంగా తీసుకోవడం వల్ల కొన్ని దుష్ప్రభావాలు కూడా ఎదురయ్యే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ఇందులో పొటాషియం అధికంగా ఉండటం వల్ల హైపర్‌కలీమియా అనే పరిస్థితి ఏర్పడి ప్రాణాపాయం కలిగిస్తుంది. అలాగే ఎక్కువగా తాగితే విరేచనాలు, గ్యాస్ట్రిక్ సమస్యలు వస్తాయి.

ఎంత పరిమాణంలో తాగాలి..
ప్రీ-డయాబెటిస్ ఉన్నవారిలో కొబ్బరినీళ్లు షుగర్ స్థాయిలను పెంచే అవకాశం ఉందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. సోడియం తక్కువగా ఉండటం వల్ల కొన్ని ప్రత్యేక ఆరోగ్య సమస్యలున్నవారికి ఇది సరిపోదు. కాబట్టి కొబ్బరి నీటిని సరైన పరిమాణంలో మాత్రమే తీసుకోవడం మంచిది. సాధారణంగా ఆరోగ్యవంతులైన వ్యక్తులు రోజుకు సుమారు 100-150 మిల్లీలీటర్ల వరకు తీసుకోవచ్చు. ఖాళీ కడుపుతో తీసుకుంటే శరీరం దాని పోషకాలను మెరుగ్గా గ్రహిస్తుంది. కొబ్బరి నీరు ఒక సహజమైన, ఆరోగ్యకరమైన పానీయం అయినప్పటికీ ఇది ఏదైనా అద్భుత ఔషధం కాదు. ప్రాసెస్ చేసిన పానీయాలకంటే ఇది మెరుగైనదే కానీ, సాధారణ నీటిని పూర్తిగా భర్తీ చేయదు. ఆర్థికంగా చూస్తే కొంతమందికి ఇది ఖరీదైన ఎంపిక అవుతుంది. అందువల్ల శరీర అవసరాలు, అందుబాటు



ఆధారంగా పానీయాలను ఎంచుకోవడం ఉత్తమం. వేసవిలో హైడ్రేషన్ ముఖ్యమని, పానీయం ఏదైనా కావచ్చు, కానీ మితిమీరకుండా తీసుకోవడం మరింత ముఖ్యమైందని నిపుణులు సూచిస్తున్నారు.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.